
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
తిరుపతి
జిల్లా వార్తలు
శుక్రవారం 24 జనవరి 2025



సామూహిక సూర్య నమస్కారాలు

తిరుపతిలోని ఎస్వీయూ తారకరామ స్టేడియంలో గురువారం సామూహిక సూర్యనమస్కార కార్యక్రమం నిర్వహించారు. స్వామి వివేకానంద, నేతాజీ జయంతి సందర్భంగా వివేకానంద కేంద్ర- ఎస్వీయూ సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టాయి. వేలాదిగా హాజరైన నగర ప్రజలు, విద్యార్థుల చేత సూర్య నమస్కార ఆసనాలు వేయించారు. వీటి వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు.

- తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఆంధ్రజ్యోతి





ఆ అధికారులపై విచారణ పూర్తి

- ప్రభుత్వం చేతిలో కార్పొరేషన్ అధికారుల చిట్టా
- నివేదిక సమర్పించిన ఆర్డీ
- ఇక చర్యలే తరువాయి

తిరుపతి, ఆంధ్రజ్యోతి

తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్‌లో అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న పూర్వ అధికారుల అక్రమాల చిట్టా రాష్ట్ర ప్రభుత్వం చేతికి వెళ్లింది. కోట్లాది రూపాయల ప్రజాధనం దుర్వినియోగంతో పాటు కార్పొరేషన్ ఆదాయానికి భారీగా గండికొట్టారని విచారణ కమిటీ గుర్తించినట్టు తెలిసింది. మంత్రి నారా లోకేశ్‌కు వచ్చిన ఫిర్యాదులపై మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ ఆదేశాలతో డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్స్ (డీఎంఏ) విచారణకు ఆదేశించిన విషయం తెలిసిందే. అనంతపురం రీజనల్ డైరెక్టర్ విశ్వనాథ్ నేతృత్వంలో 9 మంది సభ్యులతో ఏర్పాటైన విచారణ కమిటీ దాదాపు మూడు నెలలపాటు సుదీర్ఘ విచారణ అనంతరం రూపొందించిన నివేదికను ఆర్డీ విశ్వనాథ్ రాష్ట్ర మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధి విభాగం ఉన్నతాధికారులకు ఇటీవల సమర్పించారు. కార్పొరేషన్‌లో రెవెన్యూ ఆఫీసర్ (ఆర్వో)గా పనిచేసిన కేఎల్ వర్మ, మేనేజర్‌గాను, అకౌంటెంట్‌గా పనిచేసిన చిట్టిబాబుతో పాటు డీఈగా పనిచేసిన విజయకుమార్‌రెడ్డి పనితీరుపై లోతైన విచారణ జరిగింది.రెవెన్యూ, పరిపాలన వ్యవహారాల అంశాలలో పెద్దఎత్తున అవినీతి జరిగినట్టు గుర్తించినట్టుగా తెలుస్తోంది. కార్పొరేషన్లో అవకతవకలు జరిగినట్టు ఇదివరకే ప్రీ ఆడిట్ కమిటీ తేల్చిన అంశాల ఆధారాలపైనే విచారణ కమిటీ ప్రధానంగా దృష్టిపెట్టినట్టు సమాచారం. టెండరుకు వెళ్లి చేయాల్సిన పనులు నామినేటెడ్ కింద ఇవ్వడం, అనర్హులకు టెండర్లను కట్టబెట్టడం, బడ్జెట్ ఒకింత ఇస్తే రెండింతలు ఇష్టమొచ్చినట్టు ఖర్చుపెట్టడం. లేని అధికారాలు చెలాయించి దుర్వినియోగం చేయడం వంటివి విచారణ కమిటీ నివేదికలో ఉన్నట్టు సమాచారం. అదేవిధంగా రెవెన్యూ విభాగానికి సంబంధించి క్షేత్రస్థాయిలో పరిశీలించిన నిర్మాణాల కొలతలకు, రికార్డులో నమోదు చేసిన కొలతల్లో చాలా వ్యత్యాసం ఉన్నట్టు గుర్తించినట్టు తెలుస్తోంది. అడ్డగోలుగా కొలతలు తగ్గించడం, పార్కింగ్ వేయాల్సిన చోట వేయకుండా పన్నులు తగ్గించడం వంటివి బయటపడినట్టు సమాచారం. అదేవిధంగా ఇంజనీరింగ్ విభాగంలోనూ విజయకుమార్ రెడ్డి పై విచారణకు నియమితులైన పబ్లిక్ హెల్త్ ఈఈ సుబ్బరాయుడు విచారణ నివేదిక ఇంకా ప్రభుత్వానికి చేరకపోయినప్పటికీ ఆర్డీ నేతృత్వంలోని కమిటీ డీఈ అక్రమాలను కూడా గుర్తించి నివేదికలో పొందుపరిచినట్టు సమాచారం.


ఇష్టారాజ్యంగా బిల్లుల చెల్లింపు

జగనన్న విద్యాదీవెన కార్యక్రమంలో స్నాక్స్ కోసం రూ.33 లక్షల బిల్లులు చెల్లింపు జరిగినట్టు గుర్తించారు. రెండు బిల్లులుగా ఆ మొత్తాన్ని ఓ ఈవెంట్ కాంట్రాక్టర్‌కు ముట్టజెప్పినట్టు తెలిసింది. 'ఆడుదాం ఆంధ్ర' కార్యక్రమంలో నిబంధనలకు విరుద్ధంగా నిధులు ఖర్చుపెట్టిన అంశాలను కూడా నివేదికలో పొందుపరిచనట్టు తెలుస్తోంది. ఆ సమయంలో మున్సిపల్ కమిషనర్‌గా పనిచేసిన ఐఏఎస్ అధికారిణి హరిత పేరును కూడా నివేదికలో చేర్చినట్టు సమాచారం. నివేదికను పరిశీలించిన తర్వాత వీరిపై శాఖాపరమైన చర్యలకు ప్రభుత్వం సిద్ధపడుతున్నట్టు తెలుస్తోంది.

రవినాయుడు ఫిర్యాదుపై కదిలిన డొంక

గత వైసీపీ నేతలతో అంటకాగిన తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ అధికారులపై తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, శాప్ ఛైర్మన్ రవినాయుడు ప్రజాదర్బార్‌లో మంత్రి నారా లోకేశ్‌కు ఫిర్యాదు చేయడంతో విచారణకు ప్రభుత్వం ఆదేశించింది. రెవెన్యూ మేనేజర్‌గా ఉన్న వీఎస్ చిట్టిబాబు, ఆర్వో కేఎల్ వర్మపై విజిలెన్స్ విచారణ చేపట్టి, శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారు. కుప్పం మున్సిపల్ కమిషనర్‌గా పనిచేస్తున్న సమయంలో చిట్టిబాబు వైసీపీకి కొమ్ముకాస్తూ కుప్పం మున్సిపల్ ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థులను ఇబ్బందిపెట్టడంతో పాటు, ప్రలోభాలకు గురిచేశారని, గత సార్వత్రిక ఎన్నికల్లోనూ భూమన అభినయ్‌కు ఓట్లు వేయాలని సిబ్బందిపై ఒత్తిడి తెచ్చారని లేఖలో పేర్కొన్నారు. అదేవిధంగా కార్పొరేషన్ నిధులు పక్కదారి పట్టించడంలోనూ సిద్ధహస్తుడని వెల్లడించారు. ఇక ఆర్వో కేఎల్ వర్మ పన్నులు విధించడంలో ఇష్టానుసారంగా వ్యవహరించారని, వైసీపీ నేత పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి తొత్తుగా వ్యవహరించి పుంగనూరు మున్సిపల్ కమిషనర్‌గా గత ప్రభుత్వంలో పనిచేసి స్థానిక సంస్థల ఎన్నికల్లో ఆ పార్టీకి అనుకూలంగా పనిచేశారని పేర్కొన్నారు. కుప్పం స్థానిక ఎన్నికల్లో ఎన్నికల అధికారిగా వెళ్లి అక్కడా పెద్దిరెడ్డి చెప్పినట్టు చేశారని ఆరోపించారు. కార్పొరేషన్ ఆర్వోగా అనేక అక్రమాలకు పాల్పడ్డారని పేర్కొన్నారు. కాంట్రాక్టు పనుల్లో జరిగిన అవినీతి అక్రమాలలోనూ, మాజీ ఎమ్మెల్యే భూమన కరుణాకర్ రెడ్డి, మాజీ డిప్యూటీ మేయర్ అభినయ్‌కు కాంట్రాక్టర్ల నుంచి నిధులు దోచిపెట్టడంలో డీఈ విజయకుమార్‌రెడ్డి కీలకంగా వ్యవహరించారని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు.

- విజిలెన్సుకు తుడా అధికారుల సహాయ నిరాకరణ
- అక్రమాలపై ముందుకు సాగని విచారణ



ఫైళ్లా... ఇస్తాంలే!

తిరుపతి పట్టణాభివృద్ధి సంస్థ (తుడా)లో ఇంకా వైసీపీ వాసనలు పోలేదు. అక్రమాలపై దర్యాప్తు కోసం విజిలెన్సు అధికారులు ఫైళ్లు అడుగుతుంటే సహాయ నిరాకరణ చేస్తున్నట్లు తెలిసింది. దీంతో విజిలెన్సు విచారణ ముందుకు సాగడంలేదు.

- తిరుపతి(నేరవిభాగం), ఆంధ్రజ్యోతి

వైసీపీ ప్రభుత్వ హయాంలో తుడా పరిధిలో అడ్డగోలు టెండర్లతో అయినవారికి పనులు కట్టబెట్టారనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. ప్రధానంగా 2020-21లో 54 పనులకు సంబంధించి రూ.20 కోట్లు విలువ చేసే టెండర్లను పిలిచారు. 2021-22లో రూ.139 కోట్లు విలువ చేసే దాదాపు 400 పనులకు సంబంధించి టెండర్లు పిలిచారు. 2022లో రూ.475 కోట్లు విలువ చేసే 157 పనులకు సంబంధించి టెండర్లు పిలిచారు. తమకు సంబంధించిన వారికి పనులు కట్టబెట్టి అడ్డగోలుగా నిధులు దోచుకున్నారనే అభియోగాలు బలంగా ఉన్నాయి. కొన్ని పనులకు టెండర్ల దాఖలుకు ఎవరూ ముందుకు రాకపోవడంతో ఏకంగా నామినేషన్ ప్రాతిపదికన పనులు కట్టబెట్టారన్న విమర్శలున్నాయి. అధికారాన్ని అడ్డం పెట్టుకుని విచ్చలవిడిగా దుర్వినియోగం చేశారనే ఆరోపణలున్నాయి. తుడా నిధులు పుష్కలంగా ఉన్నప్పటికీ లోటు బడ్జెట్ చూపడం పట్ల పలు అనుమానాలకు దారితీస్తోంది. కూటమి అధికారంలోకి వచ్చాక దీనిపై నియోజకవర్గానికి చెందిన ప్రజాప్రతినిధి నేరుగా సీఎం చంద్రబాబుకు ఫిర్యాదు చేయడంతో ఆయన విజిలెన్సు విచారణకు ఆదేశాలు జారీ చేశారు. దీంతో విజిలెన్సు అధికారులు రంగంలోకి దిగారు. సంబంధిత ఫైళ్లు అప్పగించి విచారణకు సహకరించాలని తుడా అధికారులను కోరారు. అదిగో, ఇదిగో అంటూ కాలం గడుపుతున్నారే కానీ, దర్యాప్తునకు అవసరమైన ఫైళ్లు ఇవ్వలేదని, ఈ దిశగా తుడా అధికారులు సహకరించడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ ఆదేశాలు వచ్చి రెండు నెలలు కావస్తున్నా ఇప్పటివరకు ఆ ఫైళ్లను అప్పగించడంలో అధికారులు మీనమేషాలు లెక్కపెట్టడం వెనుక ఎవరి ఒత్తిళ్లు ఉన్నాయన్న చర్చ సాగుతోంది. ఈ విషయమై విజిలెన్సు అధికారులు పదేపదే రిమైండర్లు పంపుతున్నా పట్టించుకోవడంలేదని విశ్వసనీయంగా తెలిసింది. రెండు మూడు రోజుల్లో ఫైళ్లు అప్పగించకుంటే విజిలెన్సు డీజీకి ఫిర్యాదు చేయడానికి సిద్ధపడుతున్నట్లు సమాచారం.



కలెక్టర్ వెంకటేశ్వర్ - ఎస్పీ హర్షవర్ధనరాజు - భాగ్యలక్ష్మి

కలెక్టర్, ఎస్పీలకు బెస్ట్ ఎలక్టోరల్ అవార్డులు

- మరో ఐదుగురూ ఎంపిక
- రేపు విజయవాడలో పురస్కారాల ప్రదానం

తిరుపతి/, తిరుపతి(నేరవిభాగం), జనవరి23(ఆంధ్రజ్యోతి): జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా ఎన్నికల విధి నిర్వహణలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన అధికారులను ఎన్నికల సంఘం గుర్తించి గురువారం అవార్డులు ప్రకటించింది. 2024లో జరిగిన ఎన్నికల్లో వీరి పనితీరును ప్రాతిపదికగా తీసుకుని ఎంపిక చేసింది. వీరిలో కలెక్టర్ వెంకటేశ్వర్, అప్పటి ఎస్పీ వి.హర్షవర్ధన్‌రాజు బెస్ట్ ఎలక్టోరల్ ప్రాక్టీస్ అవార్డుకు ఎంపికయ్యారు. ఎన్నికల నిర్వహణలో ఉత్తమ ప్రతిభను కనబరిచినందుకు వీరికి ప్రత్యేక గుర్తింపు లభించింది. ప్రత్యేక కేటగిరీ అవార్డుకు తిరుపతి అర్బన్ తహసీల్దారు భాగ్యలక్ష్మిని ఎంపిక చేశారు. ఓటర్లకు అవగాహన కల్పిస్తూ ఎన్నికలను సమర్థంగా నిర్వహించడమే కాకుండా సమస్యాత్మకమైన తిరుపతి జిల్లాలో ప్రశాంతంగా పోలింగ్ నిర్వహించడాన్ని కలెక్టర్, ఎస్పీ సేవలను రాష్ట్ర ఎన్నికల సంఘం గుర్తించింది. ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్ల వలన పోలింగ్‌లో ఎలాంటి లోపాలు తలెత్తకుండా, రీపోలింగ్‌కు అవకాశం లేకుండా ఎన్నికలు నిర్వహించిన తీరుపై ఈసీ ప్రశంసించింది. వైసీపీ హయాంలో తిరుపతి నియోజకవర్గంలో జరిగిన స్థానిక, ఉప ఎన్నికలపై దొంగ ఓట్ల జాతర జరిగిన నేపథ్యంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఎన్నికలు నిర్వహించిన ఏఈఆర్వో భాగ్యలక్ష్మి ఎంపికయ్యారు. ఇక, వెంకటగిరి నియోజకవర్గం ఈఆర్వో సుధారాణిని ఎంపిక చేశారు. ఉత్తమ బీఎల్వోలుగా జ్యోతి (తిరుపతి), పార్వతి (సత్యవేడు), సాంకేతిక సహకారం అందించిన తేజపవన్(తిరుపతి) కూడా అవార్డులకు ఎంపికయ్యారు. విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఈనెల 25న జరిగే జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా వీరికి పురస్కారాలను ప్రదానం చేయనున్నారు.

జేఈఈ మెయిన్స్‌కి 2285 మంది హాజరు

తిరుపతిరూరల్, జనవరి23(ఆంధ్రజ్యోతి): ఐఐటీ, ఎన్ఐటీ, ట్రిపుల్‌ఐటీలలో ప్రవేశాల కోసం నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ఆధ్వర్యంలో నిర్వహించిన జేఈఈ మెయిన్స్‌కు రెండవరోజు గురువారం 2285మంది విద్యార్థులు హాజరై పరీక్ష రాశారని సిటీకోఆర్డినేటర్ టిక్కెలాష్‌నాథ్ పేర్కొన్నారు. 2322మంది విద్యార్థులకు గాను 2285మంది హాజరవ్వగా..37మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు పేర్కొన్నారు. విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పించామని తెలిపారు.





మోదుగులపాళెం వద్ద స్వర్ణముఖి నదిలో అక్రమార్కులు వేసిన రోడ్డు - ఆ రోడ్డు మీదుగా ట్రాక్టరులో తరలిస్తున్న ఇసుక

ఇసుక అక్రమ రవాణాకు రాచబాట

ఏర్పేడు, జనవరి 23(ఆంధ్రజ్యోతి): ఏర్పేడు మండలం మోదుగులపాళెం వద్ద స్వర్ణముఖి నది ప్రాంతంలో ఇసుక తరలించడానికి అక్రమార్కులు రాచబాట వేసుకుంటున్నారు. మూడు నెలల కిందట ఇలా రోడ్డు వేసి రాత్రింబవళ్లు ట్రాక్టర్లతో ఇసుకను తరలించి సొమ్ము చేసుకున్నారు. దీనిపై మీడియాలో కథనాలు రావడంతో రెవెన్యూ అధికారులు స్పందించి కందకాలు కొట్టి స్వర్ణముఖి నదిలోకి ప్రవేశించకుండా చర్యలు తీసుకున్నారు. కొద్ది రోజులు ఆగిన అక్రమార్కులు.. రెండు రోజుల నుంచి దర్జాగా స్వర్ణముఖి నదిలో ఎక్సకవేటర్ల సాయంతో ఇసుకను తరలించడానికి ఏకంగా రాచబాట వేసుకున్నారు. మళ్లీ ఇసుక తరలిస్తున్నారు. దీనిపై స్థానికులు శ్రీకాళహస్తి ఆర్డీవో భానుప్రకాష్‌రెడ్డి, ఏర్పేడు తహసీల్దారు భార్గవికి ఫోనులో ఫిర్యాదు చేశారు. 'సమస్య మా దృష్టికి వచ్చింది. ఇసుక అక్రమ రవాణా కోసం స్వర్ణముఖి నదిలోకి ప్రవేశించడానికి వీల్లేకుండా కందకాలు తవ్విస్తాం' అని తహసీల్దారు భార్గవి తెలిపారు.



తిరుపతిలో టీడీపీ శ్రేణుల ఉత్సాహం

ఘనంగా లోకేశ్ జన్మదిన వేడుకలు

జిల్లాలో గురువారం టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఐటీ మంత్రి నారా లోకేశ్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. అలిపిరి, తిరుమలలో టెంకాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. పలుచోట్ల అన్నదానాలు చేశారు. రక్తదాన శిబిరాలు నిర్వహించారు. కేకులు కట్ చేశారు. ఇంకొన్ని చోట్ల ర్యాలీ నిర్వహించారు. ఇలా టీడీపీ శ్రేణులు సందడి చేశారు.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

నేతాజీ సుభాష్ చంద్రబోస్‌కు నివాళులు



తిరుచానూరు, జనవరి 23(ఆంధ్రజ్యోతి): తిరుచానూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ ఆధ్వర్యంలో స్వాతంత్ర్య సమరయోధుడు, అజాద్ హింద్ ఫౌజ్ సారధి నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ప్రధానోపాధ్యాయుడు మురళి, స్కౌట్స్ తిరుపతి జిల్లా కమిషనర్ ఎంఎం రెడ్డి, స్కౌట్ మాస్టర్స్ వెంకటరత్నం, పళని, వెంకటముని, గైడ్స్ కెప్టెన్ వాసుకి, హిమబిందు, లీలాప్రతాప్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా కుర్తాళం పీఠాధిపతి జన్మదిన వేడుకలు



సిద్దేశ్వరానందస్వామికి పుష్పాభిషేకం

రామచంద్రాపురం, జనవరి 23(ఆంధ్రజ్యోతి): రాయలచెరువు కట్ట శక్తిపీఠంలో కుర్తాళం పీఠాధిపది సిద్ధేశ్వరానంద భారతిస్వామి జన్మదిన వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా మరకతశక్తి కాళీ అమ్మవారి ఆలయంలో విశేష పూజలు, మృత్యుంజయ హోమం నిర్వహించారు. అనంతరం పుష్పాభిషేకం చేశారు. ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో విచ్చేశారు. పీఠాధీశ్వరి రమ్యానంద భారతి, కార్యదర్శి శ్రీకాంత్ పాల్గొన్నారు

శ్రీవారికి కొబ్బరికాయలు సమర్పించిన టీడీపీ నేతలు



తిరుమల, జనవరి23(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మంత్రి లోకేశ్ జన్మదినం సందర్భంగా టీడీపీ నేతలు శ్రీవారికి కొబ్బరికాయలు సమర్పించారు. టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కోడూరు బాలసుబ్రహ్మణ్యం, తిరుమల నాయకుడు రాజుయాదవ్ ఆధ్వర్యంలో పలువురు కార్యకర్తలు అఖిలాండం వద్దకు చేరుకుని 3కేజీల కర్పూరం వెలిగించిన అనంతరం 511 కొబ్బరికాయలు కొట్టారు. కార్యక్రమంలో కార్యకర్తలు శివషణ్ముగం, మహిళ కమిటీ సభ్యులు, తెలుగు యువత భారీగా పాల్గొన్నారు. **ఎర్రావారిపాలెం:** మంత్రి లోకేష్ జన్మదినం సందర్భంగా గురువారం మండలంలోని పలు పాఠశాలల్లో విద్యార్థులకు టీడీపీ నాయకులు విద్యాసామగ్రిని పంపిణీ చేశారు. కార్యక్రమాల్లో మండల టీడీపీ అధ్యక్షుడు రఘునాథ్, కార్యదర్శి మహేష్ నాయుడు, నాయకులు రాజు, కుంభక లక్ష్మీదేవి, చిన్నపరెడ్డి నిరంజన్ రాయల్ తదితరులు పాల్గొన్నారు.

సీసీరోడ్లు, కాలువలను ఏర్పాటు చేయాలని వినతి

తిరుపతిరూరల్, జనవరి23(ఆంధ్రజ్యోతి): వేదాంతపురం పంచాయతీ పరిధిలోని రాందాస్‌కాలనీ, నాగరత్నమ్మ కాలనీల్లో సీసీరోడ్లు, డ్రైన్స్ ఏర్పాటు చేయాలని స్థానికులు కోరారు. పంచాయతీ కార్యాలయంలో గ్రామపంచాయతీ అభివృద్ధి ప్రణాళిక(జీపీడీపీ) గ్రామసభను గురువారం ఇన్‌చార్జి సర్పంచ్ చెరుకుల జనార్దన్‌యాదవ్ అధ్యక్షత వహించారు. ఈసందర్భంగా పలువురు గ్రామస్తులు పట్టాలు, పెన్షన్లకోసం వినతులు సమర్పించారు. సెక్రటరీ మునీశ్వరి అర్జీల వివరాలను నమోదు చేసుకున్నారు. చిగురువాడ గ్రామసభలో సర్పంచ్ ముచ్చేలి ప్రదీప్‌కుమార్‌రెడ్డి, సెక్రటరీ లక్ష్మీదేవి పాల్గొన్నారు.

అంగన్వాడీ కేంద్రాల పనితీరుపై అసంతృప్తి



అధికారులను ప్రశ్నిస్తున్న కరుణాకర్‌రెడ్డి

ఎర్రావారిపాలెం,జనవరి 23 (ఆంధ్రజ్యోతి); మండల సర్వసభ్య సమావేశం గురువారం శక్తిభవన్‌లో ఎంపీపీ రెడ్డమ్మ అధ్యక్షతన జరిగింది. జడ్పీటీసీ సభ్యుడు కరుణాకర్‌రెడ్డి మాట్లాడుతూ మండలంలోని అంగన్వాడి కేంద్రాలు సక్రమంగా పనిచేయడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. వేళకు సరిగా రావడంలేదని, పౌష్టికాహారం అర్హులకు అందించడం లేదన్నారు. ఈ సమస్య పునరావతమైతే కఠినంగా వ్యవహరించవలసి ఉంటుందని హెచ్చరించారు. మిగిలిన సభ్యులందరూ కూడా అంగన్వాడి కేంద్రాల పనితీరుపై అసంతృప్తిని వ్యక్తం చేశారు. ఉపాధి పనుల వివరాలను సర్పంచులు,ఎంపీటీసీలకు తెలియజేయడంలేదని కొందరు సభ్యులు ఆరోపించారు. సంబంధిత సర్పంచులకు ఈ వివరాలను ముందుగా తెలియజేయాలని సమావేశం కోరుతూ తీర్మానించింది. సమావేశంలో ఎంపీడీవో అరుణ,ఎంఈఓ బాలసుబ్రమణ్యం,తహసీల్దార్ పరమేశ్వరస్వామి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు

తిరుచానూరు గ్రామాభివృద్ధిపై సమీక్ష



గ్రామసభలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు

తిరుచానూరు, జనవరి 23(ఆంధ్రజ్యోతి): తిరుచానూరు పంచాయతీ కార్యాలయంలో కార్యదర్శి వెంకటరత్నం నేతృత్వంలో గురువారం గ్రామసభ నిర్వహించారు. గ్రామాభివృద్ధిపై సమీక్ష జరిపారు. గ్రామ సమస్యలపై చర్చించారు. రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థపై సమీక్షించారు. తిరుపతి రూరల్ ఎంపీపీయశోధ, ఎంపీటీసీలు శివశంకర్, చంద్రశేఖర్, వార్డు మెంబర్లు పలు సమస్యలపై మాట్లాడారు. కార్యక్రమంలో వార్డు మెంబర్లు మునేంద్ర, చంద్రశేఖర్‌రెడ్డి, యోగానంద, జయలక్ష్మి, మునిరత్నం తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా గురుదక్షిణామూర్తికి పూజలు



శ్రీకాళహస్తి, జనవరి 23(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో కొలువై ఉన్న మేధో గురుదక్షిణామూర్తికి గురువారం శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. కలశ ప్రతిష్టాపన అనంతరం వినాయక పూజ, వైదిక కృతువులు నిర్వహించారు. అనంతరం స్వామివారిని పాలు, పెరుగు, పంచామృతం, చందనం, నారికేళ జలాలతో అభిషేకించారు. పుష్పాలు, స్వర్ణాభరణాలతో అలంకరించి నైవేద్యాలు సమర్పించారు. పర్వత, చక్ర, కుంభ, మహామంగళ హారతులు ఇచ్చారు. భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.

ప్రైవేటు వెంచర్‌కు ప్రభుత్వ భూమిలో రోడ్డు

విద్యుత్ టవర్ కిందనించే వేసేశారు



ఉపాధి హామీ పథకం నిధులతో నిర్మించిన రోడ్డు



132 కేవీ విద్యుత్ టవర్ ఉన్నా నిర్మించిన రోడ్డు

రేణిగుంట, జనవరి 23(ఆంధ్రజ్యోతి): ఒక ప్రైవేటు వెంచర్ కోసం ఉపాధి పథకం కింద రూ.25.7లక్షలతో రోడ్డు నిర్మించారంటూ రేణిగుంట మండలం మల్లవరంలో వివాదం నడుస్తోంది. మార్గంలో 132 కేవీ విద్యుత్ టవర్ అడ్డుగా ఉన్నా దాని కింద నుంచి పనులు కానిచ్చేశారని అంటున్నారు. మండలంలోని మల్లవరంలో రోడ్డు వెడల్పు చేయడానికి మట్టిని గురువారం తోలుతుండగా హక్కు దారులమని కొందరు అడ్డుకున్నారు. దీంతో ఇరువర్గాల నడుమ వివాదం కాస్త ఘర్షణకు దారితీసింది. 2007 నుంచీ ఈ భూమి వివాదం నడుస్తోంది. అయితే వైసీపీ ప్రభుత్వంలో తమ భూమిలో గ్రామానికి అని చెప్పి ప్రైవేటు వెంచర్‌కు ప్రభుత్వ నిధులతో రోడ్డు వేసుకున్నారని కొందరు ఆరోపిస్తున్నారు. ఇప్పుడు 132 కేవీ విద్యుత్ టవర్ అడ్డం ఉన్నందువల్ల ప్రైవేటు వెంచర్‌కు అప్రూవల్ రాలేదంటూ రోడ్డును వెడల్పు చేస్తుండడంతో అడ్డుకున్నామని చెప్పారు. ఈ విషయమై సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి విచారణ జరిపి తమకు న్యాయం చేయాలని కోరారు.

దుకాణాల అప్పగింతకు కాలహరణం

●రుయాలో అధికారుల తీరుపై విమర్శలు ●వైసీపీ నేతలకు కట్టబెట్టేందుకు ప్రయత్నాలు?

తిరుపతి(వైద్యం), జనవరి 23(ఆంధ్రజ్యోతి): రుయాస్పత్రిలోని దుకాణాలకు టెండరు ప్రక్రియ ముగిసి నెల రోజులు దాటినా ఇంతవరకు కొత్తవారికి అప్పగించలేదు. పాత టెండరు గడువు ముగిసి కొత్త టెండరుదారులకు కేటాయించిన కొన్ని దుకాణాలను కనీసం ఖాళీ చేయించలేదు. ఈ దుకాణాలు నిర్వహిస్తున్న వైసీపీ నేతలపై అధికారులు సానుభూతి చూపిస్తున్నారా లేదా వారి నుంచి వచ్చే ఆదాయం కోసం ఇలా చేస్తున్నారా అనే విమర్శలు వినిపిస్తున్నాయి.

కొన్ని దుకాణాలను పరిశీలిస్తే

● అత్యవసర విభాగం ముందు దుకాణం, అవుట్ పోస్టు పక్కన బంకులక గిరాకీ ఉంది. ఇక్కడ ఎక్కువ వ్యాపారం జరగడమే ఇందుకు కారణం. గత ప్రభుత్వ హయాంలో ఈ రెండు దుకాణాలను వైసీపీ నేతకు కేటాయించారు. అత్యవసర విభాగం ముందు ఉండే దుకాణాన్ని అప్పుడు నెలకు రూ. 3 వేలు, బంకుకు నెలకు రూ. 2 వేల చొప్పున నామమాత్రపు అద్దెతో కేటాయించారు. ప్రస్తుత టెండర్లో అదే నేత ఈ రెండు దుకాణాలకు ఒక్కోదానికి 5 మంది పేర్లతో టెండరు వేయించి అత్యవసర విభాగం ముందు ఉన్న దానిని రూ.1,80,000 లక్షలకు, బంకును రూ. 60 వేలకు మొదట దక్కించుకున్నాడు. అయితే వీటి అద్దెను ఇప్పటికే సగానికి పైగా తగ్గించుకొని దక్కించుకునే ప్రయత్నం చేస్తున్నాడు.

●కార్యాలయ భవనం వెనుక రెండో నంబరు దుకాణాన్ని కూడా వైసీపీ నేతకు అప్పట్లో రూ.26 వేల నెల అద్దెతో కేటాయించారు. తాజా టెండర్ల ప్రక్రియలో ఈ దుకాణాన్ని రూ.1,28,000కు మరో వ్యక్తి దక్కించుకున్నాడు. ప్రస్తుతం దుకాణం నిర్వహిస్తున్న వైసీపీ నేత టెండర్లో నాలుగో స్థానంలో నిలిచాడు. అయినా ఈ దుకాణాన్ని ఈ నేత ఇప్పటికే ఖాళీ చేయలేదు. సదరు నాయకుడికే కట్టబెట్టేందుకు కట్టబెట్టేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారని తెలిసింది..

● రెండో నెంబరు దుకాణాన్ని స్థానిక ఎమ్మెల్యే పేరు చెప్పుకొని ఇటీవల దర్జాగా ఆక్రమించుకొన్న వైసీపీ నేతలు కూడా ఇంతవరకు ఖాళీ చేయలేదు. ఆ దుకాణాన్ని అధికారులు వారి నుంచి విడిపించి టెండర్లో పాడుకున్న వ్యక్తికి కొత్త వారికి కేటాయించకపోవడం గమనార్హం.

కొత్తవారిపై ఆంక్షలు

జిల్లా అధికారుల ఆదేశాలు కాదనలేక దుకాణాల గడువు ముగిసిన మూడు నెలలకు టెండర్ల ప్రక్రియ నిర్వహించారనే ఆరోపణలు ఉన్నాయి. టెండరులో దక్కించుకున్న వారికి దుకాణాలు కేటాయించకపోగా పలు ఆంక్షలు విధిస్తున్నట్లు తెలిసింది. ఆంక్షల నడుమ వ్యాపారాలు చేస్తే నష్టాలు తప్ప లాభాలు ఉండవని కొత్త వారిని పక్కకు తప్పించి పాత వారికే దుకాణాలను కేటాయించేందుకు కొందరు అధికారులు గట్టి ప్రయత్నాలు చేస్తున్నారనే ఆరోపణలు బలంగానే ఉన్నాయి.



అత్యవసర విభాగం ముందు ఖాళీ చేయని దుకాణం



వైసీపీ నేత ఖాళీ చేయని దుకాణం

తిరుమలలో భక్తురాలి మృతి

తిరుమల, జనవరి23(ఆంధ్రజ్యోతి): తిరుమలలో గురువారం ఓ భక్తురాలు మృతి చెందారు. శ్రీకాకుళం జిల్లా పలాసకు చెందిన రేణుక(51) కుటుంబ సభ్యులు, స్నేహితులతో కలిసి తిరుమలకు వచ్చారు. పాంచజన్యం విశ్రాంతి గృహంలో గదిని అద్దెకు తీసుకున్నారు. రాత్రి 8.30 గంటలకు ఆమెతో వచ్చిన వారందరూ బయటకు వెళ్లారు. రేణుక గదిలోనే ఉండిపోయారు. స్నేహితులు తిరిగి వచ్చాక గది తలుపులు ఎంత కొట్టినా తీయకపోవడంతో విశ్రాంతి భవనం అధికారులకు సమాచారమిచ్చారు. వెంటనే పోలీసులు, విజిలెన్స్ అధికారులు తలుపులు పగలకొట్టి చూడగా రేణుక మంచంపై అచేతనంగా పడి ఉన్నారు. వెంటనే అశ్విని ఆస్పత్రికి తరలించగా మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈమె మృతిపై ఎలాంటి స్పష్టత రాలేదు. వేడినీటి గ్లాస్ చేతిలో ఉండటం, బెడ్‌పై పడి ఉండటంతో గుండెపోటుతో చనిపోయారా? లేద విద్యుదాఘాతానికి గురయ్యారా అనే కోణాల్లో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

కూతురిపై లైంగిక వేధింపులు

తిరుపతి(నేరవిభాగం), జనవరి 23(ఆంధ్రజ్యోతి): కన్న కూతురిపైనే ఓ కామాంధుడు లైంగిక వేధింపులకు పాల్పడ్డాడు. దీనిపై బాధితురాలి తల్లి గురువారం అలిపిరి పోలీసులకు ఫిర్యాదు చేయగా సీఐ రాంకిషోర్ కేసు నమోదు చేశారు. వివరాలిలా ఉన్నాయి. ఆటో నడుపుతున్న వ్యక్తికి ఓ కుమార్తె ఉంది. ఈమె హాస్టల్‌లో ఉంటూ జూనియర్ ఇంటర్ చదువుతోంది. సంక్రాంతి సెలవులకు ఇంటికి వచ్చింది. ఈ క్రమంలో కన్న తండ్రి కామాంధుడిగా మారి అసభ్యకరంగా ప్రవర్తించాడు. ద్వంద్వ అర్థాలతో మాట్లాడుతూ తన చేష్టలతో లైంగిక వేధింపులకు పాల్పడ్డాడు. తన తల్లికి విషయం చెప్పడంతో గురువారం ఆమె పోలీసులకు ఫిర్యాదు చేశారు.

స్కూటరిస్టు మృతి

రేణిగుంట, జనవరి 23(ఆంధ్రజ్యోతి): గుర్తుతెలియని వాహనం ఢీకొని ద్విచక్ర వాహనదారుడు మృతి చెందాడు. ఈ సంఘటన గురువారం తెల్లవారుజామున కొత్త చెక్ పోస్టు కూడలి సమీ పంలోని వంతెనపై జరిగింది. చెంగారెడ్డిపల్లి ఎస్టీ కాలనీకి చెందిన గురుస్వామి(32)ప్రైవేటు కర్మాగారంలో విధులు ముగిం చుకుని ద్విచక్ర వాహనంపై ఇంటికి వెళ్తుండగా రేణిగుంట- కోడూరు ప్రధాన రహదారిలోని వంతెనపై గుర్తుతెలియని వాహనం ఢీకొని వెళ్లిపోవడంతో తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని తిరుపతి రుయా ఆస్పత్రికి తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య?



శ్రీకాళహస్తి, జన వరి 23(ఆంధ్ర జ్యో తి): రైలు కింద పడి గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్యకు పాల్ప డ్డాడు. రైల్వే హెడ్‌కానిస్టేబుల్ నరసింహులు తెలిపిన వివరాలు... శ్రీకాళహస్తి రైల్వేస్టేషన్ సమీపంలోని పట్టాలపై బుధవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తి రైలుకింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు.

రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలు

శ్రీకాళహస్తి. జనవరి 23(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో నలుగురు గాయపడ్డారు. పట్టణంలోని గాండ్ల వీధికి చెందిన యువరాజ్ తన కుటుంబంతో సూళ్ళూరుపేటకు కారులో బయలుదేరాడు. వీరితో పాటు స్నేహితుడైన నారాయణపురం జవహర్ మరో కారులో వారిని అనుసరించారు. ముందు వెళుతున్న యువరాజ్ కారు, ఎదురుగా వచ్చే పైపుల లారీ ఢీకొన్నాయి. దీంతో వెనుక వస్తున్న జవహర్ కారు కూడా అదుపుతప్పి ముందు ఉన్న కారును ఢీకొంది. ఈ ఘటనలో యువరాజ్ సహా కుటుంబసభ్యులు గీత, యోగేష్, భార్గవి గాయపడ్డారు. వెనుక కారులో జవహర్ కూడా స్వల్పంగా గాయపడ్డాడు. క్షతగాత్రులను శ్రీకాళహస్తి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు.

ఘనంగా మంత్రి నారా లోకేష్ జన్మదిన వేడుకలు



చంద్రగిరిలో కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే నాని, టీడీపీ నాయకులు



అక్షయక్షేత్రంలో అన్నదానం

చంద్రగిరి, జనవరి 23(ఆంధ్రజ్యోతి): మంత్రి నారా లోకేష్ జన్మదిన వేడుకలను గురువారం మండలంలో ఘనంగా నిర్వహించారు. మండల టీడీపీ అధ్యక్షుడు సుబ్రమణ్యంనాయుడు ఆధ్వర్యంలో టవర్ క్లాక్ వద్ద ఎమ్మెల్యే పులివర్తి నాని కేక్ కట్ చేసి, నాయకులకు, కార్యకర్తలకు పంచి పెట్టారు. సీహెచ్‌సీలో రోగులకు పండు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు కుమారరాజారెడ్డి, సింగు సుధా, గౌస్‌బాషా, కొండూరు ప్రవీణ్, బాలకృష్ణమూర్తి, తులసేశ్వర రెడ్డి, మొక్కల చంద్రశేఖర్‌రెడ్డి, అగరాల జయచంద్రా రెడ్డి, లంకెళ్ళ లలిత, బెల్లంకొండ రమేష్ రాయల్, తదితరులు పాల్గొన్నారు. **పాకాల:** మండల కేంద్రంలో జరిగిన టీడీపీ కార్యాలయంలో జరిగిన వేడుకల్లో పులివర్తి సుధారెడ్డి భారీ కేక్ కట్‌చేశారు. ఆ సుపత్రిలో రొట్టెలు, పండ్లు పంచిపెట్టారు.

రామచంద్రాపురం: మండలకేంద్రంలో భారీ కేక్ కట్ చేసి స్వీట్లు, పండ్లు పంచిపెట్టారు. దుర్గసముద్రం అక్షయ క్షేత్రంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు తిరుమలరెడ్డి, జిల్లా నాయకులు జనార్దన్ చౌదరి, నరసింహారెడ్డి, సురేంద్రనాయుడు, మండల నాయకులు అర్జునవాయుడు, మునిరామిరెడ్డి, రవి, కోటేశ్వరరెడ్డి పాల్గొన్నారు. **భాకరాపేట:** చిన్నగొట్టిగల్లులో టీడీపీ శ్రేణులు భారీ కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు బెల్లంకొండ మురళీ, క్లస్టర్ ఇన్‌ఛార్జ్ శివకుమార్, మదనమోహన్, చిట్టెమ్మ, వైస్-ఎంపీపీ సునీత, ఎంపీటీసీ విజయ కుమారి పాల్గొన్నారు.

నది మీదుగా మట్టిదారి నిర్మాణానికి బ్రేక్



మట్టిదారి కోసం ఎక్స్‌కవేటర్‌తో చదును చేస్తున్న దృశ్యం

తిరుపతి రూరల్, జనవరి23(ఆంధ్రజ్యోతి): ని బంధనలకు విరుద్ధంగా నది భూమిలో దారి నిర్మాణయత్నాన్ని రెవెన్యూ అధికారులు అడ్డుకున్నారు. వివరాలిలా..తనపల్లె తాత్కాలిక వంతెనకు ఆనుకుని స్వర్ణముఖినదిమీదుగా అవతలవైపు ఉన్న లేఅవుట్‌లోకి వెళ్లేందుకు నదిలో నుంచి అక్రమంగా మట్టిదారిని నిర్మించేందుకు గురువారం కొందరు ప్రయత్నించారు. ఇందుకోసం ముందుగానే మట్టిని తోలుకున్నారు. అదనుచూసి గురువారం ఉదయం ఎక్స్‌కవేటర్ సాయంతో మట్టిని చదునుచేసే పనులను చేపట్టారు. ఈ విషయం తెలియడంతో స్థానిక వీఆర్వో రమేష్ చేరుకుని పనులను అడ్డుకున్నారు. దీంతో కొంతసేపు వాగ్వాదం జరిగింది. ప్లాట్ల కొనుగోలుదారులు తమ వాదన వినిపించారు. వీఆర్వో మాట్లాడుతూ..సర్వేనంబరు 360కి సంబంధించి రెవెన్యూరికార్డుల్లో నది పోరంబోకుగా నమోదైందన్నారు. ఈ భూమిలో దారి వేయకూడదన్నారు. దీంతో పనులను నిలిపివేసి వెనుతిరిగారు.

3నుంచి వెటర్నరీలో అధ్యాపకులకు సీఏఎస్ ఇంటర్వ్యూలు

తిరుపతిరూరల్, జనవరి23(ఆంధ్రజ్యోతి): ఎస్వీవెటర్నరీ వర్సిటీపరిధిలోని టీచింగ్ ఫ్యాకల్టీకి వచ్చేనెల 3నుంచి 8వరకు నాలుగురోజుల పాటు కెరీర్ అడ్వాన్స్‌మెంట్ స్కీమ్ (సీఏఎస్) పదోన్నతులకు సంబంధించిన ఇంటర్వ్యూలను నిర్వహించనున్నారు. దీనికి సంబంధించిన ఉత్తర్వులను వర్సిటీ ఎఫ్‌ఏసీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ సీహెచ్ శ్రీలత గురువారం జారీ చేశారు. తిరుపతికేంద్రంలోని వర్సిటీ పరిపాలనా భవనంలో ఆయాతేదీల్లో ఉదయం 9గంటలకు సెలక్షన్‌కమిటీ నేతృత్వంలో ఈ ఇంటర్వ్యూలు జరుగుతాయని, పదోన్నతికి అర్హత సాధించిన అధ్యాపకులు హాజరుకావాలన్నారు. 3న వెటర్నరీ అనిమల్ హజ్బెండరీ అండ్ ఎక్స్‌టెన్షన్ ఎడ్యుకేషన్, పారాసైటాలజీ, ఫార్మకాలజీ అండ్ టాక్సికాలజీ, యానిమల్ జెనెటిక్స్ అండ్ బ్రీడింగ్, 5న యానిమల్ న్యూట్రిషన్, లైవ్‌స్టాక్ ప్రొడక్షన్ అండ్ మేనేజ్‌మెంట్, పౌల్ట్రీసైన్స్ అనాటమీ, 6న పాథాలజీ, బయోకెమిస్ట్రీ, లైవ్‌స్టాక్ ప్రొడక్షన్ అండ్ టెక్నాలజీ, మైక్రోబయాలజీ, 8న మెడిసిన్, సర్జరీఅండ్ రేడియాలజీ, ఫిజియాలజీ, గైనకాలజీ విభాగాలకు సెలక్షన్ కమిటీ సమావేశం జరుగుతుందని వివరించారు. 6మంది అసోసియేట్, 9మంది ప్రొఫెసర్లు, 21మంది సీనియర్ ప్రొఫెసర్లకు సీఏఎస్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు జాబితా విడుదల చేశారు.

ఆర్టీసీలో దుకాణాలకు దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి(ఆర్టీసీ), జనవరి 23(ఆంధ్రజ్యోతి): జిల్లా పరిధిలోని ఆర్టీసీ దుకాణాల నిర్వహణకు టెండర్ దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీపీటీవో జి.నరసింహులు ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా డిపోల మేనేజర్ కార్యాలయంలో ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు దరఖాస్తులు పొందవచ్చునని పేర్కొన్నారు. ఈ నెల 30 మధ్యాహ్నం 2గంటల లోపు డీపీటీవో కార్యాలయంలో దరఖాస్తులను అందజేయాలని తెలిపారు. 3 గంటలకు అందరి సమక్షంలో టెండర్లు తెరిచి ఖరారు చేస్తామని పేర్కొన్నారు.

ఖాళీల వివరాలిలా...

శ్రీహరి బస్టాండు 18, శ్రీనివాస బస్టాండు 7, ఏడుకొండలు 1, కమర్షియల్ కాంప్లెక్స్ 8, పుత్తూరు 3, శ్రీకాళహస్తి 7, సత్యవేడు 1, వరదయ్యపాళెం 1, కోట 5, నాయుడుపేట 2, గూడూరు 1, వెంకటగిరి 4, రేణిగుంట 3, పాకాల 9, భాకరాపేట 3, ఏర్పేడు 1, చిల్లకూరు 2, బాలాయపల్లి 1 ఉన్నాయి.

వరసిద్ధుడికి కానుకగా ఐదు వెండి బిందెలు



వెండి బిందెలను అందిస్తున్న సాయిరాజ్

ఐరాల(కాణిపాకం), జనవరి 23 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి పాలాభిషేకం నిర్వహణకు హైదరాబాద్‌కు చెందిన సాయిరాజ్ గురువారం ఐదు వెండి బిందెలను కానుకగా అం దించారు. ఈవో పెంచలకిషోర్ మాట్లాడుతూ.. ఒక్కో వెండి బిందె కిలో బరువుందని, రూ.లక్ష విలువ చేయనున్నట్లు తెలిపారు. దాతకు స్వామి దర్శన ఏర్పాట్లు చేశారు. సూపరింటెండెంట్ కోదండపాణి, ఆలయ ఇన్‌స్పెక్టర్ రవి తదితరులు పాల్గొన్నారు. కాగా, ఏలూరు రేంజి ఐజీ అశోక్‌కుమార్ గురువారం వరసిద్ధుడిని దర్శించుకున్నారు.

పలువురికి చెవిరెడ్డి పరామర్శ



బాబ్జీనాయుడు కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి

చంద్రగిరి, జనవరి 23(ఆంధ్రజ్యోతి): అరిగిలవారిపల్లెలో వైసీపీ నాయకుడు మణియాదవ్ తండ్రి మునిరత్నంయాదవ్ మృతికి మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి గురువారం నివాళులర్పించారు. అనంతగుర్రప్పగారిపల్లెలో మృతి చెందిన మాజీ సింగిల్‌విండో అధ్యక్షుడు మేడసాని బాబ్జీనాయుడు ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. రెడ్డివారిపల్లెలో శంకర్ కుటుంబ సభ్యులను పరామర్శించారు.

ఆర్టీసీ కాంట్రాక్టు డ్రైవర్‌పై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు

తిరుపతి(నేరవిభాగం), జనవరి 23(ఆంధ్రజ్యోతి): అలిపిరి ఆర్టీసీ డిపోలో కాంట్రాక్టు డ్రైవర్‌గా పనిచేస్తున్న హరిప్రసాద్‌పై తిరుపతి ఈస్ట్ పోలీసులు గురువారం ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారు. ఈస్ట్ సీఐ రామకృష్ణ కథనం మేరకు.. చిన్నగొట్టిగల్లు మండలం తొగటపల్లికి చెందిన హరిప్రసాద్‌కు ఏర్పేడు మండలానికి చెందిన ఓ యువతితో మూడు నెలలుగా ప్రేమ వ్యవహారం నడుస్తోంది. ఆమె బైరాగిపట్టెడలోని ప్రైవేటు మందుల దుకాణంలో పనిచేస్తోంది. వీరిద్దరూ కలసి మెలసి తిరిగారు. ఆ యువతిపై అనుమానంతో ఇతడు పెళ్లి చేసుకోవడానికి అంగీకరించలేదు. బాధితురాలి ఫిర్యాదు మేరకు ఈస్ట్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. నిందితుడు హరిప్రసాద్‌ను అరెస్టు చేశారు.

అత్యాధునిక వైద్య పరికరాల వితరణ

వడమాలపేట, జనవరి 23(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి అత్యాధునిక వైద్య పరికరాలు వితరణగా అందజేశారు. గురువారం హైదారాబాద్‌కు చెందిన అవేర్ హెల్త్ అండ్ రీసెర్చ్ ఫౌండేషన్ చైర్మన్ మాధవన్ ఎస్‌బీఐ సహకారంతో వాటిని అందించారు. హైడ్రాలిక్ బెడ్లు, ఇంజెక్షన్ ట్రాలీలు, ఎయిల్ కూలర్ అందజేశారు. కార్యక్రమంలో స్థానిక ఎస్‌బీఐ ఆర్ఎం వెంకటేశ్వరరావు, హెచ్‌ఆర్ మేనేజర్ శివయ్య, స్థానిక బ్రాంచ్ మేనేజర్ రవికుమార్, వైద్యాధికారి చక్రపాణి, హెల్త్ సూపర్‌వైజర్ చంద్రమోహన్ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న గుజరాతీ ఎద్దు



నగరి, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ శాంతి యాత్రలో భాగంగా తిరుపతి నుంచి కన్నియా కుమారికి వెళుతున్న ఇస్కాన్ ప్రచార రథం గురువారం నగరి పట్టణంలోని ఓంశక్తి ఆలయం వద్దకు చేరుకుంది. ఈ రథాన్ని లాగుతున్న గుజరాతీ ఎద్దుల్లో ఒకదానికి గాయమైతే చికిత్స కోసం ఇక్కడ ఆగారు. స్థానిక పశువైద్యాధికారులు ఆ ఎద్దుకు చికిత్స చేశారు. ఈ సందర్భంగా పెద్ద కొమ్ములు కలిగిన ఈ ఎద్దును చూసి స్థానికులు ఫొటోలు, సెల్ఫీలు తీసుకున్నారు. ఓంశక్తి ఆలయ నిర్వాహకులు రథంతోపాటు వచ్చిన వారికి భోజన, వసతి సదుపాయం కల్పించారు.

యువతకు దిక్సూచి లోకేశ్

ఘనంగా యువనేత జన్మదిన వేడుకలు



పాదాల మండపం వద్ద కొబ్బరికాయలు కొడుతున్న టీడీపీ నేతలు

తిరుపతి, జనవరి23(ఆంధ్రజ్యోతి) : టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ జన్మదిన వేడుకలు గురువారం నగరంలో ఘనంగా జరిగాయి. తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, శాప్ ఛైర్మన్ రవినాయుడు ఆధ్వర్యంలో పార్టీ నేతలు అలిపిరి పాదాల మండపం వద్ద 420 టెంకాయలు కొట్టి ఆయురారోగ్యాలతో ఉండాలని మొక్కుకున్నారు. అనంతరం అక్కడి నుంచి బైక్ ర్యాలీగా ఎన్టీఆర్ విగ్రహం వద్దకు చేరుకున్నారు. వినూత్న రీతిలో స్పోర్ట్స్ కేక్ కట్‌చేసి, టపాసులు కాల్చి సంబరాలు చేశారు. రుయా ఆస్పత్రి ఎదుట పేదలకు అన్నదానం నిర్వహించారు. తిరుపతి నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, పార్లమెంటు అధ్యక్షుడు నరసింహ యాదవ్‌లు మాట్లాడారు. యువతకు దిక్సూచిలా నిలుస్తున్న లోకేశ్ భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు చేపట్టాలని ఆకాంక్షించారు. కార్యక్రమాల్లో నాయీబ్రాహ్మణ కార్పొరేషన్ ఛైర్మన్ రుద్రకోటి సదాశివం, కార్పొరేటర్ ఆర్సీ మునికృష్ణ, నాయకులు శ్రీధర్ వర్మ, దంపూరి భాస్కర్, బుల్లెట్ రమణ, భట్టే కీర్తి, పుష్పావతి యాదవ్, పులిగోరు మురళి, సింగంశెట్టి సుబ్బరామయ్య, కుమారమ్మ, మహేష్ యాదవ్, ఊట్ల సురేంద్ర నాయుడు, మన్నెం శ్రీనివాసులు, పాటకం వెంకటేష్, ఆముదాల తులసీరాం, కొట్టే హేమంత్ రాయల్, బ్యాంకు శాంతమ్మ, సుబ్బు యాదవ్, ఆర్సీ శ్రీనివాసులు, కృష్ణ యాదవ్, గోళ్ల లోకేశ్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

● యువతకు ఆశాకిరణం : ఎమ్మెల్యే ఆరణి



యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు నిరంతరం కృషి చేస్తున్న మంత్రి లోకేశ్ యువతకు ఒక ఆశా కిరణమని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు అన్నారు. లోకేశ్ జన్మదినం సందర్భంగా టీడీపీ నగర ప్రధాన కార్యదర్శి మహేష్ యాదవ్, శాప్ ఛైర్మన్ రవినాయుడు సంయుక్త ఆధ్వర్యంలో రుయా ఆస్పత్రి వద్ద పెద్దఎత్తున అన్నదానం చేశారు. ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొని అన్నప్రసాద వితరణ చేశారు.

● కోడూరు యువసేన ఆధ్వర్యంలో..



వృద్ధురాలికి కేక్ తినిపిస్తున్న డాక్టర్ కోడూరు బాలసుబ్రమణ్యం

టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ కోడూరు బాలసుబ్రమణ్యం ఆధ్వర్యంలో నారా లోకేశ్ జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. కపిలతీర్థంలో అల్పాహారం, పాలు పంపిణీ చేశారు. రైల్వేస్టేషన్ వద్ద కేక్ కట్‌చేసి పంచిపెట్టారు. సత్యనారాయణ పురం వద్ద అన్నదానం నిర్వహించారు. పెరుమాళ్ మధు, ఖాజా తదితరులు పాల్గొన్నారు.

అనాథలకు అన్నదానం



అనాథలకు రగ్గులు పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు

తిరుపతి(నేరవిభాగం), జనవరి 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర విద్యాశాఖా మంత్రి నారా లోకేష్ పుట్టిన రోజు సందర్భంగా గురువారం ఆర్.ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో టీడీపీ తిరుపతి పార్లమెంటు అధికార ప్రతినిధి శరత్ చౌదరి, రమణయాదవ్‌లు అలిపిరి బాలాజీ బస్టాండు వద్ద 150 మంది అనాథలకు రగ్గులు పంపిణీ చేశారు. అన్నదానం చేశారు. శాప్ ఛైర్మన్ రవి నాయుడు, పులిగోరు మురళీకృష్ణ, నరసింహయాదవ్‌లు మాట్లాడుతూ లోకేశ్‌ను తెలుగు యువత నాయకులు ఆదర్శంగా తీసుకుని పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు దినేష్, దిలీప్, రూపేష్, రంజిత్, నారాయణ పాల్గొన్నారు.

ఎస్వీయూలో రక్తదానం



రక్తదానం చేసిన వారికి సర్టిఫికెట్లు అందజేస్తున్న సుగుణమ్మ

తిరుపతి (విశ్వవిద్యాలయాలు) జనవరి 23 (ఆంధ్రజ్యోతి): మంత్రి నారా లోకేశ్ జన్మదినాన్ని పురస్కరించుకుని గురువారం ఎస్వీ యూలో ఆయన అభిమానులు రక్తదానం చేశారు. తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి రాగల ఆనంద్‌గౌడ్ ఆధ్వర్యంలో చేపట్టిన ఈ కార్యక్రమంలో 100 మంది స్వచ్ఛందంగా వచ్చి రక్తదానం చేశారు. వీరికి వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు, మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, టీడీపీ జిల్లా అధ్యక్షుడు నరసింహ యాదవ్, శాప్ ఛైర్మన్ రవినాయుడు, కార్పొరేటర్ అన్నా అనిత, శ్రీధర్‌వర్మ, సర్టిఫికెట్లు అందించారు. కార్యక్రమంలో పత్తిపాటి వివేక్‌చౌదరి, పాకనాటి హరికృష్ణ, రామ్మోహన్, రాజు, అశోక్ ఆర్కేనాయుడు పాల్గొన్నారు.

రుయాలో వైద్యాధికారుల రక్తదానం



తిరుపతి(వైద్యం), జనవరి 23(ఆంధ్రజ్యోతి): నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి పురస్కరించుకుని రుయాస్పత్రిలోని రక్తనిధి శిబిరంలో నేషనల్ మెడికో ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో వైద్యాధికారులు గురువారం రక్తదానం చేశారు. ప్రతి ఒక్కరూ రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని ఏఆర్ఎంవో హరికృష్ణ కోరారు. 30 మంది వైద్యులు, యూజీ, పీజీ వైద్య విద్యార్థులు రక్తదానం చేశారు. వైద్యాధికారులు రోజారమణి, హరిబాబు, పరమేశ్వర్‌బాబు, శరత్ చంద్ర, హరిత పాల్గొన్నారు.

స్విమ్స్‌లో..: స్విమ్స్ శ్రీపద్మావతి హాస్పిటల్లో ఉచిత రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. వైద్యులు, వైద్య సిబ్బంది రక్తదానం చేశారు. కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ వనజాక్షమ్మ, బ్లడ్ బ్యాంక్ విభాగాధిపతి శ్రీధర్‌బాబు, వైద్యులు శివకుమార్, శర్వాణి, సురేష్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

పట్టించుకోండి సారూ...



రోడ్డు తవ్వి వదిలేశారు..

అసలే ఇరుకు రోడ్డు.. ఆపై తవ్వేసిన కాలువతో రైల్వేస్టేషన్‌కు ఎదురుగా ఉన్న నేతాజీ రోడ్డులో ప్రజలకు అవస్థలు తప్పడం లేదు. మురుగు కాలువ మరమ్మతుల కోసం తవ్విన మట్టిని రోడ్డుపై దిబ్బగా పోశారు. పనులు పూర్తయినా మట్టి మాత్రం రోడ్డుపైనే వదిలేశారు. దీంతో రెండు వారాలుగా అక్కడ రాకపోకలకు ఇబ్బందిగా మారింది. ఉదయం, సాయంత్రం ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతోంది. వెంటనే మట్టిదిబ్బలను తొలగించాలని స్థానికులు, వాహనదారులు కోరుతున్నారు.

- తిరుపతి అర్బన్ (ఆంధ్రజ్యోతి)





జీవన విధానంలో భాగం సూర్య నమస్కారం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జనవరి 23 (ఆంధ్రజ్యోతి): సూర్య నమస్కారం అనేది భారతీయ జీవన విధానంలో భాగమని మంత్రి మహేశ్వరి, శ్రీశక్తి పీఠాధిపతి శ్రీరమ్యానంద భారతి పేర్కొన్నారు. సూర్య నమస్కారంతో మనిషి ఆరోగ్యం మెరుగుపడుతుందన్నారు. ఎస్వీయూ తారకరామా స్టేడియంలో గురువారం నిర్వహించిన సామూహిక సూర్య నమస్కార కార్యక్రమంలో వారు మాట్లాడుతూ ప్రతిరోజూ సూర్య నమస్కారం చేయడం ద్వారా క్రమశిక్షణ అలవడుతుందని అభిప్రాయపడ్డారు. ఎస్వీయూ వీసీ ప్రొఫెసర్ సీహెచ్ అప్పారావు మాట్లాడుతూ మనిషికి యోగా, ధ్యానం, వ్యాయామం వంటివి ఆరోగ్యాన్ని పెంపొందిస్తాయన్నారు. ఎస్వీయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ మాదాల భూపతి నాయుడు మాట్లాడుతూ సూర్య నమస్కారం ద్వారా మనిషి శరీరానికి, మనసుకు ఉత్తేజం కలుగుతుందని తెలిపారు. స్విమ్స్ డైరెక్టర్ డాక్టర్ ఆర్వీ కుమార్ మాట్లాడుతూ మన సంస్కృతీ, సంప్రదాయాలను అనుసరించడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చన్నారు. సంస్కృత విశ్వవిద్యాలయ వీసీ ఆచార్య జీఎస్ఆర్ కృష్ణమూర్తి మాట్లాడుతూ స్వామి వివేకానంద, సుభాష్ చంద్రబోస్ వంటి వారి జీవితం ఈ తరానికి గొప్ప స్ఫూర్తిని అందిస్తుందన్నారు. వేంకటేశ్వర వేద విశ్వవిద్యాలయ వీసీ ఆచార్య రాణీసదాశివమూర్తి మాట్లాడుతూ ప్రతిరోజూ సూర్య నమస్కారం చేయడం ద్వారా మనసు నిర్మలమవుతుందన్నారు. శాప్ ఛైర్మన్ అనిమిని రవినాయుడు మాట్లాడుతూ చదువుతో పాటు ఈ తరం క్రీడా, సాంస్కృతిక అంశాల పైనా దృష్టి సారించాలన్నారు. నిర్వాహకులు సీహెచ్ వెంకటేశ్వరప్రసాద్, హనుమంతరావు మాట్లాడారు.

సాహిత్యానికి సంగీత పరిమళం అద్దిన పండితుడు

రాళ్ళపల్లె జయంతి సభలో ఆచార్య దీప్త



రాళ్లపల్లె విగ్రహానికి నివాళి అర్పిస్తున్న ఆచార్య దీప్త

తిరుపతి (విశ్వవిద్యాలయాలు) జనవరి 23 (ఆంధ్రజ్యోతి): రాళ్లపల్లె అనంతకృష్ణ శర్మ సాహిత్యానికి సంగీత పరిమళం అద్దిన పండితుడని జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయ ఆంగ్ల విభాగ ఆచార్యులు దీప్త పేర్కొన్నారు. రాళ్లపల్లె అనంతకృష్ణశర్మ జయంతి కార్యక్రమాన్ని టీటీడీ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. పద్మావతి యూనివర్సిటీ సమీపంలో గల ఆయన వి గ్రహానికి తొలుత పుష్పాంజలి ఘటించారు. అన్నమాచార్య కళా మందిరంలో నిర్వహించిన జయంతి సభలో అనంతకృష్ణశర్మ మనుమరాలు ఆచార్య దీప్త మాట్లాడారు. రాళ్లపల్లెకు సంగీతం, సాహిత్యం రెండు కళ్ల అన్నారు. అన్నమయ్య కీర్తనలను పరిష్కరించి, స్వరపరిచి, గ్రంథం చేసిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. గౌరిపెద్ది వేంకట శంకర భగవాన్ మాట్లాడుతూ అద్భుతమైన సాహిత్య సృజన చేసిన ప్రముఖులలో రాళ్లపల్లె ఒకరని అన్నారు. సామాన్య ప్రజలకు అర్థమయ్యేలా అన్నమయ్య కీర్తనల్లోని ఆనాటి సాహిత్యాన్ని పరిష్కరించి, అందించారని గుర్తు చేసుకున్నారు. ప్రముఖ శాసన పరిశోధకులు సొరకాయల కృష్ణారెడ్డి మాట్లాడుతూ సంగీతం, సాహిత్యం తెలిసిన పండితుడు రాళ్లపల్లె అని కొనియాడారు. కార్యక్రమంలో అన్నమాచార్య ప్రాజెక్టు డైరెక్టర్ రాజగోపాలరావు, ప్రోగ్రాం అసిస్టెంట్ కోకిల పాల్గొన్నారు.

రహదారి భద్రత అందరి బాధ్యత



ర్యాలీని ప్రారంభిస్తున్న ఏఎస్పీ వెంకట్రావు, ఆర్టీవో మురళీమోహన్

తిరుపతి (జీవకోన), జనవరి 23 (ఆంధ్రజ్యోతి): రహదారి భద్రతను అందరూ బాధ్యతగా తీసుకోవాలని ఏఎస్పీ(అడ్మిన్) వెంకట్రావు, జిల్లా రవాణా శాఖ అధికారి కొర్రపాటి మురళీమోహన్ అన్నారు. జాతీయ రహదారి భద్రత మాసోత్సవాలలో భాగంగా గురువారం కరకంబాడీ రోడ్డులో రవాణా, పోలీసు శాఖ ఆధ్వర్యంలో వాకతాన్ నిర్వహించారు. ర్యాలీని ప్రారంభించిన అనంతరం వారు మాట్లాడుతూ హెల్మెట్‌ధారణ, మోటారు వాహనాల నియమ నిబంధనలపై అవగాహన కోసం ఈ కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. ప్రమాదాల సంఖ్యను తగ్గించడమే లక్ష్యంగా పనిచేయాలన్నారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ తప్పక ధరించాలని, సెల్‌ఫోన్ డ్రైవింగ్ చేయకూడదని సూచించారు. ర్యాలీ కరకంబాడీ రోడ్డు నుంచి లీలామహల్ సర్కిల్ మీదుగా కొనసాగింది. ట్రాఫిక్ డీఎస్పీ రామకృష్ణమాచారి, మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్లు సుబ్రహ్మణ్యం, శ్రీనివాసరావు, అతికానాజ్, అంజనేయ ప్రసాద్, మోహన్‌కుమార్, వెంకటరమణ నాయక్, స్వర్ణలత, ప్రసాద్ వర్మ, ఎస్వీ, అన్నమాచార్య ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ సదస్సులో 400 పరిశోధనా పత్రాల సమర్పణ



తిరుపతి (విశ్వవిద్యాలయాలు) జనవరి 23 (ఆంధ్రజ్యోతి): పద్మావతి యూనివర్సిటీ వేదికగా రెండు రోజుల అంతర్జాతీయ సదస్సు ప్రారంభమైంది. మైక్రోబయల్ టెక్నాలజీ, బయో ఇంజినీరింగ్, గ్లోబల్ అడ్వాన్స్ అంశంపై ఈ సదస్సు చేపట్టారు. ఇందులో మలేసియాలోని తెరంగను డైరెక్టర్ ఇఖ్వరుద్దీన్ అబ్దుల్లా కీలకోపన్యాసం చేశారు. ప్రాధాన్యత గల ఈ అంశంపై సదస్సు జరగడం మంచి పరిణామమన్నారు. పద్మావతి వర్సిటీ వీసీ ఉమ మాట్లాడుతూ ఈ అంతర్జాతీయ సదస్సు విజయవంతం కావాలని ఆకాంక్షించారు. హాజరైన ప్రతినిధులను సత్కరించారు. వివిధ అంశాలపై 400 మంది ప్రతినిధులు పరిశోధనా పత్రాలను సమర్పించారు. ఈ పత్రాలతో కూడిన సావనీర్‌ను సదస్సులో ఆవిష్కరించారు.

సమాజ సంక్షేమానికి ఎస్‌బీఐ చేయూత



విద్యార్థులకు సైకిళ్లు అందజేస్తున్న వెంకటేశ్వరరావు, బ్యాంకు అధికారులు

తిరుపతి (జీవకోన), జనవరి 23(ఆంధ్రజ్యోతి): సమాజ సంక్షేమం, అభివృద్ధికి స్టేట్‌బ్యాంకు ఆఫ్ ఇండియా తనవంతు సహాయ సహకారాలు అందిస్తోందని ప్రాంతీయ మేనేజరు ఎస్.వెంకటేశ్వరరావు తెలిపారు. సత్యనారాయణపురం జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు రూ.లక్ష విలువైన పది సైకిళ్లను గురువారం అందజేశారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు విద్యాపరమైన నైపుణ్యాన్ని సాధించిడానికి ఇలాంటి ప్రోత్సాహకాలు ఉపయోగపడతాయని తెలిపారు. బ్యాంకు అధికారులకు పాఠశాల ఉపాధ్యాయ బృందం కృతజ్ఞతలు తెలిపింది.

ఘనంగా ఎస్డీహెచ్‌ఆర్ కళాశాల వార్షికోత్సవం



ప్రదీప్‌కుమార్‌ను సన్మానిస్తున్న డీపీఎస్ చక్రవర్తిరెడ్డి

తిరుపతిరూరల్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎస్డీహెచ్‌ఆర్ జూనియర్ కళాశాల వార్షికోత్సవాన్ని మహతి కళాక్షేత్రంలో గురువారం ఘనంగా నిర్వహించారు. అతిథిగా హాజరైన ఆర్‌ఐవో జీవీ ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ చదువుతోపాటు సామాజిక, నైతిక విలువలు పెంచుకోవాలని ఆకాంక్షించారు. కళాశాల ఛైర్మన్ డీపీఎస్ చక్రవర్తిరెడ్డి మాట్లాడుతూ ఇష్టపడి చదివి తమ ఆశయాలతోపాటు తల్లిదండ్రుల ఆశలను నెరవేర్చాలని తెలిపారు. మోటివేటర్ కేవీ ప్రదీప్ మాట్లాడుతూ విద్యార్థులు ఆత్మవిశ్వాసం కలిగి ఉండాలని సూచించారు. జాతీయ స్థాయి నృత్య పోటీలలో బంగారు పతకం సాధించిన విద్యార్థి శివానిని ఛైర్మన్ ప్రత్యేకంగా అభినందించారు. వివిధ అంశాలలో ప్రతిభచాటిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

రేపటి నుంచి మహిళా చిత్రకళా ప్రదర్శన

తిరుపతి (విశ్వవిద్యాలయాలు) జనవరి 23 (ఆంధ్రజ్యోతి): నగరంలో ఈ నెల 25వ తేదీ నుంచి మహిళా చిత్రకళా ప్రదర్శన నిర్వహించనున్నారు. శ్రీపద్మావతి చిత్రాలయం ఆధ్వర్యంలో ఉదయీ ఇంటర్నేషనల్ హోటల్ వేదికగా రెండు రోజుల పాటు ఈ కార్యక్రమాన్ని చేపడతారు. కలెక్టర్ వేంకటేశ్వర్, రచయిత ఆర్ఎం ఉమామహేశ్వరరావు ఈ ప్రదర్శనను ప్రారంభిస్తారు. ప్రముఖ చిత్రకారిణులు కిరణ్ కుమారి, బత్తుల అర్చన, జి.గాయత్రిదేవి, రాగిమాను శ్రీదేవి, కోనేరు ఊర్మిళ, ఎం.సాయిదివ్య, సలదగు లావణ్య రూపొందించిన పెయింటింగ్స్ ప్రదర్శన, అమ్మకం చేపట్టనున్నారు. చిత్ర, కళాభిమానులు ఈ ప్రదర్శనను తిలకించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

సుభాష్‌చంద్రబోస్‌కు ఘన నివాళి



చంద్రబోస్‌కు నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

తిరుపతి(ఆటోనగర్), జనవరి 23 (ఆంధ్రజ్యోతి): నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి సందర్భంగా కాటన్ మిల్లు వద్ద ఉన్న ఆయన విగ్రహానికి సీపీఎం, నేతాజీ సుభాష్ ఫౌండేషన్, ప్రజా సంఘాల నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సుబ్రమణ్యం, వేణుగోపాల్, మహమ్మద్ రఫీ, ఓ.వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు. తిరుపతి ప్రకాశం పార్కులో మహిళా సంఘం నాయకులు ఆయన చిత్రపటం పెట్టి పుష్పాంజలి ఘటించారు. కార్యక్రమంలో సాయిలక్ష్మి, వాకర్స్ అసోసియేషన్ నాయకులు కేశవులు, వెంకటరెడ్డి, గోపి, వెంకటముని పాల్గొన్నారు.

లింగ సమానత్వంపై నేడు జాతీయ సదస్సు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు) జనవరి 23 (ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణ కేంద్రాల్లో లింగ సమానత్వం సాధించడం అంశంపై పద్మావతి మహిళా యూనివర్సిటీలో శుక్రవారం నుంచి జాతీయ సదస్సు జరగనుంది. ఉమెన్ స్టడీస్ - లా విభాగం సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టనున్నాయి. ఉదయం 10 గంటలకు పద్మావతి సీస్ బ్లాక్-2లో ఈ సదస్సు ప్రారంభం కానుంది. జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టనున్నారు. ఇందులో వీసీ ప్రొఫెసర్ వి.ఉమ, అమరా హాస్పిటల్ ఎండీ డాక్టర్ రమాదేవి అతిథులుగా పాల్గొంటారు. డీన్ ప్రొఫెసర్ వాణి అధ్యక్షతన ప్రారంభ సభ నిర్వహిస్తారు. ఈ సదస్సు సమన్వయకర్తలుగా డాక్టర్ ఎన్.శ్రీరజని, డాక్టర్ పి.నీరజ, డాక్టర్ ఇందిరా ప్రియదర్శిని వ్యవహరించనున్నారు.

టెర్రకోట బొమ్మలకు భౌగోళిక గుర్తింపు

రెండ్రోజులు జిల్లాలో పర్యటించిన బీ2బీ బృందం

అంతర్జాతీయ స్థాయిలో మార్కెటింగ్‌కు సన్నాహాలు



చిత్తూరు సెంట్రల్, జనవరి 23(ఆంధ్రజ్యోతి): టెర్రకోట మట్టి కుండలు, బొమ్మలు, తెల్లజిల్లేడు వినాయక బొమ్మల తయారీ కేంద్రాలకు భౌగోళిక గుర్తింపుపై కలెక్టర్ సుమిత్ కుమార్ దృష్టి సారించారు. జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో తగు సూచనలు చేశారు. సంకల్ప పథకం అమలులో భాగంగా హైదరాబాదు రిసొల్యూట్ బీ2బీ కన్సల్టెన్సీ నేతృత్వంలోని బృందం మంగళ, బుధవారాల్లో పలమనేరు మండలం గంటావూరులోని టెర్రకోట మట్టికుండలు, బొమ్మల తయారీ ప్రాం తాలను సందర్శించింది.గంగాధరనెల్లూరు మండలంలోని కలవకుంటలో తెల్లజిల్లేడు వినాయక బొమ్మల తయారీ ప్రాంతాల్లో సమాచారం సేకరించింది. ఇవి ఎంతో ఆకర్షణీయంగా,సంప్రదాయబద్ధంగా ఉండటంతో వీటికి జాతీయం గానూ, అంతర్జాతీయంగానూ డిమాండ్ ఉండడమే భౌగోళిక గుర్తింపు సాధించడానికి ఉపకరించనుంది.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

తిరుపతి(ఆటోనగర్), జనవరి 23 (ఆంధ్రజ్యోతి): తిరుపతి విద్యుత్ టౌన్ డివిజన్ పరిధిలోని 220 కేవీ, రేణిగుంట 132 కేవీ విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా శుక్రవారం ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని టౌన్ డివిజన్ ఈఈ వి.చంద్రశేఖరరావు ఒక ప్రకటనలో తెలిపారు. పానకం, వేమూరు, గంగనగుంట, మిట్టమీదకండ్రిగ, కస్తూరి కండ్రిగ, ముండ్లపూడి ప్రాంతాల్లో అంతరాయం ఉంటుందని వివరించారు.

నేతాజీకి ఘన నివాళి



సుభాష్ చంద్రబోస్‌కు నివాళి అర్పిస్తున్న ఫౌండేషన్ నేతలు

తిరుపతి అర్బన్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతిని పురస్కరించుకుని స్థానిక కులశేఖర ఆళ్వార్ రోడ్డు చివర్లో ఉన్న ఆయన విగ్రహానికి ఘన నివాళి అర్పించారు. నేతాజీ సుభాష్ చంద్రబోస్ ఫౌండేషన్ ఛైర్మన్ సుంకర చిన్నరెడ్డిబాబు ఆధ్వర్యంలో చేపట్టిన ఈ కార్యక్రమంలో అజిత్‌బాషా, వి.వి.రమణరావు, వేణు, రవి, రమేష్ పాల్గొన్నారు.

అనాథాశ్రమానికి నిత్యావసర సరుకుల పంపిణీ



సరుకులు అందజేస్తున్న ఎమ్మెల్సీ సిపాయి సుబ్రహ్మణ్యం, హర్షవర్ధన్‌రెడ్డి

తిరుపతి (జీవకోన), జనవరి 23 (ఆంధ్రజ్యోతి): సుభాష్ చంద్రబోస్ జయంతిని పురస్కరించుకుని జేసీ అల్యూమిని క్లబ్ వారు జీవకోనలోని సుభాష్ చంద్రబోస్ అనాథ శరణాలయానికి గురువారం నిత్యావసర సరుకులు అందజేశారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రహ్మణ్యం విద్యార్థులకు సరుకులు అందజేశారు. కార్యక్రమంలో హర్షవర్ధన్‌రెడ్డి, డాక్టర్ ఈశ్వర ప్రకాష్, కేవీ చౌదరి, శంకరయ్య, శరణాలయ నిర్వాహకులు కృష్ణమూర్తి పాల్గొన్నారు.

చంద్రశేఖర్‌కు ఎస్ఈగా పదోన్నతి



తిరుపతి, జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : తిరుపతి స్మార్ట్ సిటీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఈఈ)గా అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్న బి.చంద్రశేఖర్‌కు సూపరింటెండింగ్ ఇంజనీర్ (ఎస్ఈ)గా పదోన్నతి లభించింది. ఆ మేరకు రాష్ట్ర మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధి విభాగం ఉత్తర్వులు జారీ చేసింది. తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ ఇంజనీరుగా విధులు నిర్వహిస్తున్న ఆయన ఇటీవల చిత్తూరు అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ (చుడా) ఈఈగా బదిలీపై వెళ్లారు. అయితే ఆయన సీనియారిటీ, సమర్థతను గుర్తించిన కమిషనర్ మౌర్య స్మార్ట్ సిటీ ఈఈగా అదనపు బాధ్యతలు అప్పగించారు. ఈ క్రమంలో కోర్టు ఆదేశాల మేరకు ఎస్ఈగా ప్రభుత్వం పదోన్నతి కల్పిస్తూ ఉత్తర్వులు ఇచ్చింది.

డాక్టరేట్ ప్రదానం



మురళి

తిరుపతి (విశ్వవిద్యాలయాలు) జనవరి 23 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జేఎన్‌టీయూ ఈఈఈ విభాగ పరిశోధకుడు చెరుకూరి మురళి డాక్టరేట్ పొందారు. హార్మోనిక్ రిడక్షన్ ఇన్ విండ్ ఎనర్జీ బేస్డ్ ఫైవ్ ఫేజ్ స్క్వెర్కెల్ కేజ్ ఇండక్షన్ జనరేటర్ ఇంటిగ్రేటెడ్ టు గ్రిడ్ యూజింగ్ మోడర్న్ కంట్రోల్ టెక్నిక్స్ అంశంపై ఎస్వీయూ ఈఈఈ విభాగ ప్రొఫెసర్ సీహెచ్ చెంగయ్య పర్యవేక్షణలో సిద్ధాంత గ్రంథాన్ని సమర్పించారని కాకినాడ జేఎన్‌టీయూ ఎవల్యూషన్ డైరెక్టర్ పద్మజారాణి తెలిపారు.

శ్రీవారి ఆలయంలో ముగిసిన అధ్యయనోత్సవాలు



తిరుమల, జనవరి23(ఆంధ్రజ్యోతి): శ్రీవారి ఆలయంలో గత నెల 30న మొదలైన అధ్యయనోత్సవాలు గురువారం ముగిశాయి. ఈసందర్భంగా రంగనాయక మండపంలో శ్రీదేవి, భూదేవి సమేత మలయప్పస్వామిని వేంచేపు చేసి దివ్యప్రబంధ గోష్ఠి నిర్వహించారు. అధ్యయనోత్సవాల్లో భాగంగా తిరుమలనంబి స్మృత్యర్థం గురువారం 'తన్నీరుముదు' ఉత్సవం నిర్వహించారు. సాయంత్రం సహస్రదీపాలంకార సేవ తర్వాత మలయప్పస్వామి వాహన మండపానికి వేంచేపు చేశారు. తిరుమలనంబి వంశీకులు బిందెలతో ఆకాశగంగ తీర్థాన్ని వాహన మండపానికి తీసుకువచ్చారు. అక్కడ వేదమంత్రోచ్చారణ నడుమ జీయర్ స్వాములు, ఆచార్య పురుషులు, ప్రబంధ పండితులు పవిత్ర తీర్థజలంతో ఆలయంలోకి వేంచేపు చేశారు. మూలవిరాట్టు పాదాలపై అమరిఉన్న బంగారు తొడుగుకు పవిత్ర ఆకాశగంగ జలంతో అభిషేకం చేశారు. ఈసందర్భంగా నంబి రచించిన 'తిరుమొళి పాశురాలను' పారాయణం చేశారు.

ఆన్‌లైన్ ట్రేడింగ్ పేరిట మోసం

● రూ.20 లక్షలు పోగొట్టుకున్న యువకుడు

పెళ్లకూరు, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్ ట్రేడింగ్ పేరిట కొందరి తీరుతో ఓ యువకుడు మోసపోయారు. పోలీసులు తెలిపిన ప్రకారం.. పెళ్లకూరు మండలం అర్ధమాలకు చెందిన తాండవ కృష్ణ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి. వర్క్ ఫ్రమ్‌హోమ్ చేస్తున్న ఈయన కొందరి సూచన మేరకు ఆన్‌లైన్ ట్రేడింగ్‌లో పెట్టుబడి పెట్టారు. సుమారు రూ.20లక్షల నగదును పోగొట్టుకున్నారు. దీనిపై మరో రూ.11 లక్షలు కట్టి వీఐపీ ఖాతా ఆన్‌లైన్‌లో ప్రారంభిస్తే మొత్తం నగదు ఇస్తామని వారు చెప్పడంతో అనుమానం వచ్చి ఎస్‌ఐ నాగరాజును ఆశ్రయించారు. ఇది సైబర్ నేరంగా గుర్తించి.. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

శ్రీహరి సర్వదర్శనానికి 13 గంటలు



తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 13 గంటల సమయం పడుతోంది. గురువారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్‌2లో 22 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచిఉన్నారు.

మంగళవారం నాటి హుండీ ఆదాయం: రూ.3.10 కోట్లు

బుధవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 62,223

తలనీలాలు సమర్పించినవారు: 19,704





తిరుమల, ఆంధ్రజ్యోతి

ప్రకృతితో మమేకమవుతూ అడుగులు వేయడం ఓ మధురానుభూతి.. అటవీప్రాంతాన కొండలు, గుట్టలు ఎక్కుతూ ముందుకు సాగిపోవడం ఓ అందమైన అనుభవం. ప్రకృతి ప్రియుల్లో సాహస ప్రవృత్తిని పెంచే ట్రెక్కింగ్ ఇలాంటి విశేషాలెన్నింటినో పరిచయం చేస్తుంది. శేషాచల అడవుల అందాలను ఆస్వాదించే అవకాశం కలిగిస్తుంది. ట్రెక్కింగ్ అభిరుచి ఉంచేచాలు.. 'తిరుపతి అడ్వెంచరెస్ అడిక్ట్స్' గ్రూప్ మిమ్మల్ని కాంక్రీట్ జంగిల్ నుంచి పచ్చని సోయగాల మధ్య నడిపిస్తుంది. అందమైన సూర్యోదయాలు, కనువిందు చేసే వనాలు, పారే కాలువలను దాటుకుంటూ కాలాన్ని మర్చిపోయేలా చేస్తుందీ ప్రయాణం. ఓ ఆదివారం ఉల్లాసంగా గడపడానికి తిరుపతి అడ్వెంచరెస్ అడిక్ట్స్‌తో చేతులు కలిపేయండి మరి.

ప్రకృతి అందాలను ఆస్వాదిస్తూ ముందడుగు

ఓ యువకుడి చొరవతో సాహసయాత్ర

శేషాచలాన్ని చుట్టేస్తున్న ట్రెక్కర్లు

ఆరుగురితో సమూహానికి శ్రీకారం

తిరుపతికి చెందిన ఇనేష్ సిద్ధార్థ వైల్డ్ లైఫ్ ఫొటోగ్రాఫర్. ఐదారేళ్లుగా శేషాచల అడవుల్లో సాహసోపేతమైన ట్రెక్కింగులకు వెళ్లి అద్భుతమైన ప్రకృతి అందాలు, పక్షులు, వన్యప్రాణులను కెమెరాలో బంధించడం అలవాటుగా మార్చుకున్నారు. ఈ యువకుడి అభిరుచికి స్నేహితులు భానుప్రకాష్, హేమకుమార్, దేవప్రసాద్, విష్ణు, వెంకటమునిి జత కలిశారు. వీరంతా ఇటీవల 'తిరుపతి అడ్వెంచర్ అడిక్ట్స్' అనే ట్రెక్కింగ్ గ్రూప్‌ను ఏర్పాటు చేశారు. 38 రోజుల్లోనే తిరుపతి సమీపంలోని శేషాచల అడవుల్లోని ఆరు ప్రాంతాల్లో విజయవంతంగా టెక్కింగ్ నిర్వహించారు. తాటికోన, కాలభైవరగుట్ట, మల్లమడుగు, మెగాలిత్, మామండూరు, పేర్నిటి హిల్ వంటి ప్రాంతాలను చుట్టేశారు. దాదాపు 300 మందికి పైగా ట్రెక్కింగ్ లవర్స్ పాల్గొని ప్రకృతి అందాలను ఆస్వాదించారు. సుందరగిరులు, సహజ వనరులను అన్వేషించడంలో ఈ గ్రూప్ విశేషంగా కృషి చేస్తోంది. పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించడంలో సఫలీకృతమవుతోంది.

ప్రతి ఆదివారం విహారం

ఈగ్రూప్ ప్రతి ఆదివారం ట్రెక్కింగ్ క్యాంప్ నిర్వహిస్తోంది. వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్ ద్వారా ఔత్సాహికులను సమీకరించి ఉత్సాహపరుస్తోంది. సూర్యోదయ వీక్షణం కోసం వీరంతా వేకువజామునే శ్రీకారం చుడుతున్నారు. సాయంత్రానికి తిరిగొచ్చేలా ప్లాన్ చేసుకుంటున్నారు. పిల్లల నుంచి 65 ఏళ్ల వృద్ధుల వరకూ ఈ సాహసయాత్రలో పాలుపంచుకుంటున్నారు. విద్యార్థులు, డాక్ట ర్లు, టెకీలు, వ్యాపారులు, లాయర్లు, ఇలా వివిధ రంగాల వారు పరస్పరం ఊసులాడుకుంటూ ఒక్కటై కలిసిపోతున్నారు.కొ న్ని గంటల పాటు ప్రత్యేక లోకంలో విహరిస్తున్నామా అనే భావన కలుగుతోందని గ్రూప్ సభ్యు లు చెబుతున్నారు.





తిరుపతి సమీప అందాలు చూపడమే లక్ష్యం

తిరుపతి, తిరుమల గొప్ప పుణ్యక్షేత్రాలని అందరికీ తెలుసు. కానీ అడ్వెంచరెస్ ప్రేమికులకు తెలియని అందమైన అడవులు, కొండలు, ప్రదేశాలు తిరుపతి చుట్టూ ఉన్నాయి. అడ్వెంచరెస్ టూరిజాన్ని పెంపొందించడం మా లక్ష్యం. మాతో వచ్చిన వారు గుర్తుండిపోయేలా అందమైన జ్ఞాపకాలను పొందుతున్నారు. ఆధునిక జీవనశైలిలో చాలా మంది శారీరక దృఢత్వాన్ని కోల్పోతున్నారు. ట్రెక్కింగుల ద్వారా శారీరక దృఢత్వాన్ని, మానసిక ఆరోగ్యాన్ని పెంచుకోవచ్చు. దైనందిన ఒత్తిడి నుంచి ప్రకృతి ద్వారా ఉపశమనం పొందవచ్చు.

- ఇనేష్ సిద్ధార్థ, సంస్థ వ్యవస్థాపకుడు

నూతన ఆవిష్కరణలకే గుర్తింపు

● తిరుపతిలో ఐఐటీలో పాన్ వరల్డ్ ఆఫ్ టెక్నాలజీ శాటిలైట్ ఈవెంట్ ● తిరుపతి ఐఐటీ- వీల్స్ మధ్య కుదిరిన ఒప్పందం



తిరుపతి ఐఐటీలో జరిగిన ఈవెంట్‌కు హాజరైన వివిధ పరిశ్రమల ప్రతినిధులు, విద్యాసంస్థల ప్రతినిధులు, పూర్వ విద్యార్థులు

ఏర్పేడు, జనవరి 23(ఆంధ్రజ్యోతి): నూతన ఆవిష్కరణలతోనే గుర్తింపు లభిస్తుందని పలువురు వక్తలు అన్నారు. పాన్ - ఐఐటీ వరల్డ్ ఆఫ్ టెక్నాలజీ(పీఐడబ్ల్యూఓటి)శాటిలైట్ ఈవెంట్ తిరుపతి ఐఐటీలో గురువారం జరిగింది. ప్రపంచవ్యాప్తంగా ప్రముఖ శాస్త్రవేత్తలు, ఐఐటీ పూర్వ విద్యార్థులు, విద్యార్థులు, అధ్యాపకులు, విద్యారంగం, పరిశ్రమలు, ప్రభుత్వం నుంచి మేధావులు, నిపుణులు ఈవెంట్‌లో పాలుపంచుకున్నారు. వీల్స్ గ్లోబల్, కాన్ఫడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ(సీఐఐ) ఆంధ్రప్రదేశ్ సహకారంతో నిర్వహించిన ఈ కార్యక్రమం ఐఐటీ డైరెక్టర్ ప్రొఫెసర్ కేఎన్ సత్యనారాయణ ప్రారంభోపన్యాసంతో మొదలైంది. సీఐఐ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు డాక్టర్ వి.మురళీకృష్ణ, రతన్ అగర్వాల్, వీల్స్ ఫౌండేషన్ అధ్యక్షుడు అగర్వాల్ పలు ఒప్పందాలపై సంతకాలు చేశారు. సమావేశంలో మొదట వికసిత్ భారత్ కోసం పరిశ్రమల్లో విద్యా సహకారంలో తీసుకోవాల్సిన మార్పులు తదితర అంశాలపై చర్చించారు. మేరీల్యాండ్ బాల్టీమోర్ కౌంటీ విశ్వవిద్యాలయం నుంచి డాక్టర్ గోవిందరావు, సి.శ్రీనివాసరాజు, శ్రీసిటీ ఇంటిగ్రేటెడ్ బిజినెస్ అధ్యక్షుడు సతీస్ కామత్ నూతన ఆవిష్కరణలకు, అభివృద్ధికి అవసరమైన సూచనలను అందజేశారు. మధ్యాహ్నం జరిగిన సమావేశంలో బ్రిడ్జింగ్ టెక్నాలజీ, గ్రామీణ అభివృద్ధిపై ప్యానల్ సమావేశం, సుదీర్ఘ చర్చ జరిగింది. గ్రామీణ ప్రాంతాల్లో సమగ్ర అభివృద్ధికి అవసరమైన సాంకేతికతను ఉపయోగించడంపై చర్చించారు. స్టార్టప్ పర్యావరణ వ్యవస్థ గురించి రమాకాంత్ దేశాయ్ చర్చించారు. పర్యావరణ సామాజిక పాలన ఆవిష్కరణ ప్రభావాన్ని నడిపించడానికి విద్య-పరిశ్రమ భాగస్వామ్యాలపై డాక్టర్ రాఘవన్ రామనన్ మాట్లాడారు. అనంతరం వినూత్న ప్రాజెక్టులను ప్రదర్శించే పరిశోధన పోస్టరు ప్రదర్శనతో సదస్సు ముగిసింది. పీఐడబ్ల్యూఓటీ ఉపగ్రహ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించడం ద్వారా తిరుపతి ఐఐటీ ప్రభావవంతమైన పరిశోధనలను నడిపించడం, ఆవిష్కరణలు పెంపొందించడం ముఖ్య ఉద్దేశంగా కార్యక్రమం నిర్వహించారు. ప్రపంచ సవాళ్లను పరిష్కరించడానికి విద్య- పరిశ్రమల మధ్య వారధులను నిర్మించడం పట్ల సదస్సులో మేధావుల చర్యలతో ఐఐటీ ప్రాంగణం కొత్తకళను సంతరించుకుంది.

పట్టు తప్పిన పోలీసు శాఖ

గాడిలో పెట్టండి ఎస్పీగారూ!

జిల్లా పోలీసు శాఖ పట్టుతప్పింది. కొన్ని స్టేషన్లలో ఎవరికి వారే యమునా తీరులాగా తయారయ్యారు. ప్రధానంగా జిల్లాలోని కొన్ని స్టేషన్లు సెటిల్‌మెంట్లుకు అడ్డాగా మారాయనే విమర్శలున్నాయి. ప్రధానంగా శ్రీకాళహస్తి, రామచంద్రాపురం, సత్యవేడు, నాయుడుపేట, పాకాల, అలిపిరి, ఏర్పేడు, తిరుమల టూ టౌన్ తదితర స్టేషన్లపై ఈ విమర్శలు ఎక్కువగా వస్తున్నాయి. రేణిగుంట తీరు మీద కూడా ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. భూ వ్యవహారాల్లో పోలీసులు తలదూరుస్తున్నారనే విమర్శలున్నాయి.

- తిరుపతి(నేరవిభాగం), ఆంధ్రజ్యోతి

ఏళ్ళ తరబడి తిష్ట.. దిగజారుతున్న ప్రతిష్ఠ



జిల్లాలోని తిరుపతి, తిరుమల పోలీసు స్టేషన్లలో పనిచేస్తున్న సిబ్బంది కొందరు ఏళ్ల తరబడి ఒకే చోట తిష్టవేసి కూర్చున్నారు. తిరుమల టూ టౌన్ స్టేషన్‌లో పనిచేస్తున్న ఒక ఏఎస్‌ఐ కానిస్టేబుల్ నుంచి హెడ్ కానిస్టేబుల్, ఏఎస్‌ఐ వరకు కొండ దిగడం లేదు. ఇక తిరుమల 1 టౌన్, టూటౌన్, క్రైం, ట్రాఫిక్ స్టేషన్లలో పనిచేస్తున్న సీఐలు రెండు, మూడేళ్ళకు బదిలీ అవుతున్నా కింది స్థాయి సిబ్బందికి మాత్రం స్థాన చలనం జరగడం లేదు. వన్‌టౌన్ స్టేషన్‌లో ప్రొటోకాల్ విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ ఉన్నత స్థాయి అధికారుల అండదండలతో కొండ దిగని ఘనుడుగా పేరు తెచ్చుకున్నాడు. ఇక తిరుపతి అలిపిరి స్టేషన్‌లో పనిచేస్తున్న ఒక హెడ్ కానిస్టేబుల్ దాదాపు 15 సంవత్సరాలుగా అక్కడే తిష్ట వేసి కూర్చొని సెటిల్‌మెంట్లు, భూ దందాలు చేస్తున్నట్టు ఆరోపణలున్నాయి. అలాగే వెస్ట్‌లో పని చేస్తున్న ఇద్దరు కానిస్టేబుళ్లు, ఒక ఏఎస్‌ఐ, రైటర్ హవా కొనసాగిస్తున్నారు. బహిరంగ మద్యపానం విషయంలోనూ, బార్ల వద్ద కొట్లాటలు, ఘర్షణలు జరిగినా తిరుపతిలోని పోలీసులకు కాసులు వర్షం కురిపిస్తోంది. తిరుపతి రూరల్, ఈస్ట్, చంద్రగిరి, రేణిగుంట, ఏర్పేడు, పాకాల, శ్రీకాళహస్తి, సత్యవేడు, నారాయణవనం వంటి స్టేషన్లలో దీర్ఘకాలంగా ఉన్న రైటర్ల తీరు వల్ల పోలీసు వ్యవస్థకు చెడ్డపేరు వస్తోంది. కొన్ని స్టేషన్లలో పనిచేస్తున్న ఎస్‌ఐలు నేరుగా సీఐలను శాసించే స్థాయికి ఎదిగారనే విమర్శలు వినిపిస్తున్నాయి. జిల్లాలోని పోలీసుల తీరును గ్రహించిన ఎస్పీ సుబ్బరాయుడు దాదాపు 10 మందిపై సస్పెన్షన్లు, చార్జి మెమోలు జారీ చేశారు. కొందరిని వీఆర్‌కు బదిలీ చేశారు. తప్పు చేస్తే దండన తప్పదనే భయం కొంతవరకు పోలీసు శాఖలో పుట్టింది. ఇంతలోనే ఆయన్ను ప్రభుత్వం బదిలీ చేసింది.

తిరుపతి ట్రాఫిక్ గాడిలో పడేనా?

తిరుపతి ట్రాఫిక్ వ్యవస్థ పూర్తిగా గాడి తప్పింది. ట్రాఫిక్‌లో పనిచేస్తున్న కొందరు అధికారులు రోడ్లపైకి రాకుండా విధులు నిర్వహిస్తున్నారనే విమర్శలు వున్నాయి. గతంలో ఎస్పీగా పనిచేసిన సుబ్బరాయుడు సెల్ కాన్ఫరెన్సులో ట్రాఫిక్‌లో పనిచేస్తున్న ఒక సీఐ పనితీరుపై తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. కొన్ని ముఖ్య కూడళ్లలో ట్రాఫిక్ సిబ్బంది అసలు కనపడని పరిస్థితి. లీలామహల్ సర్కిల్. పూర్ణకుంభం సర్కిల్, అన్నమయ్య సర్కిల్, బాలాజీ కాలనీ, ఎంఆర్‌పల్లి, కృష్ణాపురం ఠానా, తిరుమల బైపాస్ రోడ్డు, గాంధీ రోడ్డు వంటి ప్రధాన రహదారుల్లో వెళ్ళాలంటేనే బీపీ వస్తోంది. అడ్డదిడ్డం పార్కింగ్‌లు, హారన్ల మోత, నెంబరు ప్లేట్లు లేని ఆటోలు, లైసెన్సులు లేని వాహనదారులతో తిరుపతి ట్రాఫిక్ గందరగోళంగా తయారైంది. దీన్ని దృష్టిలో పెట్టుకుని తిరుపతి ట్రాఫిక్‌ను దారిలో పెట్టాల్సిన ప్రధాన బాధ్యత నూతన ఎస్పీగా బాధ్యతలు తీసుకుంటున్న హర్షవర్ధన రాజుపై వుంది. ఇక గంజాయి అక్రమ రవాణాకు అడ్డాలుగా మారిన తిరుపతి, రేణిగుంట రైల్వే స్టేషన్లలో గట్టి భద్రత ఏర్పాటు చేయాల్సి వుంది.

నేడు జిల్లా ఎస్పీగా హర్షవర్ధన రాజు బాధ్యతలు స్వీకరణ

తిరుపతి జిల్లా ఎస్పీగా మళ్లీ హర్షవర్ధన రాజు శుక్రవారం బాధ్యతలు స్వీకరించనున్నారు. గతంలో ఎన్నికల కౌంటింగ్ సమయంలో ఇక్కడ రెండు నెలల పాటు సమర్థవంతంగా పనిచేసిన అనుభవం ఆయనకు వుంది.ఆయన గురువారం తిరుపతికి చేరుకున్నారు.శుక్రవారం తిరుమలలో శ్రీవారినిదర్శించుకుని జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఉదయం 9 గంటలకు బాధ్యతలు స్వీకరించనున్నారు.

వచ్చారు.. వెళ్లారు!

● మల్లిమడుగులో అక్రమ మట్టి తవ్వకాలపై మైనింగ్ శాఖ అధికారుల తూ..తూ..మంత్ర పరిశీలన



మల్లిమడుగు వంకలోకి వచ్చే వాగు వద్ద కందకాలు పూడ్చి వేసి పైపులు పెట్టి రోడ్డును పరిశీలిస్తున్న ఆర్ఐ కృష్ణ

రేణిగుంట, జనవరి 23(ఆంధ్రజ్యోతి): మల్లిమడుగు రిజర్వాయరులో అక్రమ మట్టి తవ్వకాలపై ఆంధ్రజ్యోతి దినపత్రికలో 'మల్లిమడుగులో మళ్లీ మట్టి తవ్వకాలు' శీర్షికన వార్తా కథనం ప్రచురితం కావడంతో మైనింగ్ అధికారులు తూ.. తూ.. మంత్రంగా స్పందించారు. గురువారం మధ్యాహ్నం మట్టి తవ్విన ప్రాంతాలను అలా వచ్చి ఇలా పరిశీలించి వెళ్లిపోయారు. ఈ విషయమై నివేదికలు సిద్ధం చేసి జిల్లా ఉన్నతాధికారులకు పంపిస్తామని తమ ఫొటోలు, పేర్లు రాయవద్దన్నారు. ఏదైనా సమాచారం కావాలంటే జిల్లా అధికారిని సంప్రదించాలని పరిశీలనకు వచ్చిన మైనింగ్ అధికారి తెలిపారు. ఈ విషయమై జిల్లా మైనింగ్ శాఖ అధికారులను వివరణ కోరేందుకు ఫోన్లో సంప్రదించగా సదరు అధికారి స్పందించ లేదు.

టెండర్లు తీసుకున్న వాళ్లు చెక్‌పోస్టులు పెట్టుకోవచ్చు

జిల్లాలో ప్రభుత్వం వద్ద మైనింగ్‌కు సంబంధించి టెండర్లు తీసుకున్న వాళ్ల ప్రత్యేకమైన చెక్‌పోస్టులు పెట్టుకోవచ్చని రేణిగుంట మండల పరిధిలో ఈ ప్రాంతంలో కాకుండా గాజులమండ్యం ప్రాంతంలో సైతం మైన్స్ తరలించే వాహనాలకు బిల్లులు తనిఖీ చేయవచ్చని మైనింగ్ శాఖ అధికారులు స్పష్టం చేశారు.

ఉపాధి కల్పన ప్రణాళికలు రూపొందించండి

తిరుపతి(కలెక్టరేట్), జనవరి 23 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో యువతకు ఉపాధి కల్పించే దిశగా అధికారులు ప్రణాళికలు రూపొందించాలని కలెక్టర్ వెంకటేశ్వర్ అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో ఆయన అధికారులతో సమీక్షించారు. జిల్లాలోని నిరుద్యోగ యువతకు వారు కోరుకుంటున్న రంగంలో నైపుణ్యాలను పెంపొందించి, ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా చర్యలు తీసుకోవాలన్నారు. ఎస్వీ యూనివర్శిటీలో ప్రతినెలా డ్రోన్, నారావారిపల్లెలో లైట్ మోటార్ వెహికల్ డ్రైవింగ్ శిక్షణా తరగతులు నిర్వహించాలన్నారు. ప్రతి నియోజకవర్గంలోనూ జాబ్‌మేళా నిర్వహించాలని సూచించారు. సమావేశంలో డీఆర్‌డీఏ పీడీ శోభన్ బాబు, పరిశ్రమల శాఖ జీఎం శ్రీరామమూర్తి, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి లోకనాథం, పలు యూనివర్సిటీల అధికారులు పాల్గొన్నారు.

అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్



రూ.4.5 కోట్ల ఎర్రచందనం స్వాధీనం

● ముగ్గురు అంతర్రాష్ట్ర స్మగ్లర్ల అరెస్ట్



స్మగ్లర్లతో పాటు ఎర్రచందనం చూపుతున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు

మంగళం, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు జిల్లా గుడిపాల మండలం వద్ద టాస్క్‌ఫోర్స్ పోలీసులు ముగ్గురు అంతర్రాష్ట్ర స్మగ్లర్లను అరెస్ట్ చేసి, వారి నుంచి రూ.4.5 కోట్ల విలువైన ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నట్లు టాస్క్‌ఫోర్స్ హెడ్ ఎల్.సుబ్బరాయుడు తెలిపారు. కపిలతీర్థం వద్ద గల టాస్క్‌ఫోర్స్ కార్యాలయంలో గురువారం ఎస్పీ శ్రీనివాస్‌తో కలిసి ఆయన మీడియాకు వివరాలు వెల్లడించారు. రహస్య సమాచారం మేరకు గుడిపాల మండల పరిధిలోని చిత్తూరు, వేలూరు మార్గంలో పానాటూరు సమీపంలోని అండర్ బ్రిడ్జి వద్ద టాస్క్‌ఫోర్స్ సిబ్బంది బుధవారం రాత్రి ఆకస్మిక తనిఖీలు చేపట్టారని తెలిపారు. ఈ విషయాన్ని గమనించిన స్మగ్లర్లు కంటైనర్ వాహనాన్ని దూరంగా ఆపి పారిపోయే ప్రయత్నం చేశారన్నారు. టాస్క్‌ఫోర్స్ సిబ్బంది వారిని అదుపులోకి తీసుకున్నారని తెలిపారు. కంటైనర్ తనిఖీ చేయగా ఏడు టన్నుల బరువు గల 413 ఎర్రచందనం దుంగలు బయటపడినట్లు వెల్లడించారు. పట్టుబడ్డ ఎర్రచందనం విలువ రూ.4.5 కోట్లు ఉంటుందన్నారు. తమిళనాడు రాష్ట్రం సేలం జిల్లాలోని గోడౌన్ నుంచి దుంగలను అస్సోంకు తరలిస్తున్నట్లు విచారణలో తేలిందన్నారు. పట్టుబడిన వారు తమిళనాడుకు చెందిన నరేంద్రకుమార్, అస్సోంకు చెందిన బినోయికుమార్, రాజస్థాన్‌కు చెందిన విజయ్‌జోషిలుగా గుర్తించామన్నారు. నిందితులను పట్టుకోవడంలో ప్రతిభ కనబరచిన సిబ్బందికి రివార్డులు ప్రకటించారు.

కేవీకేలలో ఉద్యోగావకాశాలు

తిరుపతి(క్రీడలు), జనవరి 23 (ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తి, సత్యవేడులోని ఎన్టీఆర్ క్రీడా వికాస కేంద్రాలలో ఉద్యోగావకాశాలు కల్పించనున్నట్లు జిల్లా క్రీడాభివృద్ధి అధికారి సయ్యద్‌సాహెబ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీకాళహస్తిలో బ్యాడ్మింటన్ శిక్షకుడి, నైట్ వాచ్‌మన్, సత్యవేడులో నైట్‌వాచ్‌మన్ పోస్టు మాత్రమే ఖాళీ ఉన్నట్లు పేర్కొన్నారు. 10వ తరగతి చదివి, ఆసక్తిగలవారు మరిన్ని వివరాలకు 98663 17312 నెంబరులో సంప్రదించాలని కోరారు.

ఎలుకల నివారణ మందు పంపిణీ

తిరుపతి(ఎంఆర్‌పల్లె), జనవరి 23(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని 19 మండలాల్లో 80 వేల హెక్టార్లలో రబీ సీజనులో ఎలుకల నుంచి పంటలను కాపాడుకునే చర్యలు చేపడుతున్నట్లు జిల్లా వ్యవసాయాధికారి ప్రసాదరావు, అసిస్టెంట్ డైరెక్టర్ ధనంజయ రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందుకోసం బ్రోమోడయోలిన్ మందును రైతులకు ఉచితంగా పంపిణీ చేస్తామన్నారు. గురు, శుక్రవారాల్లో పంచాయతీల సహకారంతో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

టీడీపీ నాయకుల రక్తదానం



కోట, జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : కోటలో గురువారం మంత్రి నారా లోకేశ్ జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. టీడీపీ మైనార్టీసెల్ జిల్లా అధ్యక్షుడు షేక్ జలీల్ అహ్మద్ ఆధ్వర్యంలో 30 పడకల ప్రభుత్వ ఆసుపత్రి ప్రాంగణంలో భారీ కేక్ కట్ చేశారు. రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. గూడూరు ఆస్పత్రి సిబ్బంది పర్యవేక్షణలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు రక్తదానం చేశారు. రక్తదాతలకు జలీల్ అహ్మద్‌తోపాటు టీడీపీ నాయకులు ప్రసంశాపత్రాలు అందజేసి అభినం దించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, నల్లపరెడ్డి జగన్‌హన్‌రెడ్డి, చిల్లకూరు దశరథరామిరెడ్డి, తీగల సురేష్‌బాబు, వాకా విజయభాస్కర్‌రెడ్డి, సుష్మారెడ్డి, ఎంపీటీసీలు షంషుద్దీన్, సురేష్, మస్తాన్‌బాషా ఉన్నారు.

ఓజిలి: మంత్రి నారా లోకేశ్ జన్మదినాన్ని పురస్కరించుకుని సూళ్లూరుపేటలో జరిగిన సంబరాలకు టీడీపీ మండల కన్వీనరు విజయకుమార్‌నాయుడు ఆధ్వర్యంలో మండలంలోని పలు గ్రామాల నుంచి నాయకులు తరలివెళ్లారు. పలువురు రక్తదానం చేశారు. ఓజిలి మండల ఉపాధ్యక్షుడు శ్రీనివాసులరెడ్డి, ఓజిలి క్లస్టర్ ఇన్‌చార్జి కంకణాల సత్యవరప్రసాద్‌రావు తదితరులు పాల్గొన్నారు.

రహదారి నిబంధనలు పాటించాలి

గూడూరు, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): వాహనదారులు రహదారి నిబంధనలు పాటించాలని ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ అన్నారు. గురువారం ఆదిశంకర కళాశాలలో జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాల్లో భాగంగా డ్రైవర్లకు అవగాహన కల్పించి ర్యాలీ నిర్వహించారు. ఆర్టీవో బీఎస్‌కే కిషోర్, ఎంవీఐలు అజాద్ జాకీర్, శాంతి, ఏఎంవీఐ ప్రభాకర్, ఏవో శ్రీదేవి, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వేణుమాధవ్ పాల్గొన్నారు.

పుత్తూరు వార్తలు

తండ్రి బాటలో తనయుడు లోకేశ్

● జన్మదిన వేడుకల్లో ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్



కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్

పుత్తూరు అర్బన్, జనవరి 23(ఆంధ్రజ్యోతి): మంత్రి లోకేశ్ తండ్రికి తగ్గ తనయుడిగా ఎదుగు తారని ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ అన్నారు. గురువారం పుత్తూరులో లోకేశ్ జన్మదిన వేడుకలను కూటమి శ్రేణులతో కలిసి నిర్వహించారు. అనంతరం వేదవ్యాస డిగ్రీ కళాశాలలో ఎన్టీఆర్ బ్లడ్ బ్యాంక్ ఆధ్వర్యంలో చేపట్టిన మెగా రక్తదాన శిబిరంలో పాల్గొన్న విద్యార్థులను ఎమ్మెల్యే అభినందించారు. పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ గంజి మాధవయ్య, టీడీపీ పట్టణ అధ్యక్షుడు ధనపాల్, ప్రధాన కార్యదర్శి కరుణాకర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

లోకేశ్ ఆధ్వర్యంలో పార్టీ మరింత బలోపేతం



కేక్ కట్ చేస్తున్న విజయ్‌బాబు

పుత్తూరు అర్బన్, జనవరి 23(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర విద్యా శాఖ మంత్రి లోకేశ్ నేతృత్వంలో టీడీపీ మరింత బలోపేతం కానుందని పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పోతుగుంట విజయ్‌బాబు పేర్కొన్నారు. గురువారం ఎంబీ రోడ్డులో లోకేశ్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి పార్టీ శ్రేణులకు పంచిపెట్టారు. అనంతరం ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు పండ్లు పంచిపెట్టారు. పరమేశ్వర మంగళం ఎంపీటీసీ సభ్యురాలు శ్రీజ బాలాజీనాయుడు, టీడీపీ రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యనిర్వాహక కార్యదర్శి ధనపాల్, తెలుగుమహిళా విభాగం కార్యదర్శి నాగరత్న, విజయ్ చౌదరి, మధుసూదన్‌రాజు, విజయ్‌శేఖర్ నాయుడు, బాబురాయల్ పాల్గొన్నారు.

తప్పును దిద్దుకున్న తెలుగు తమ్ముళ్లు

పుత్తూరు, జనవరి 23(ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల ఇబ్బందులను గుర్తించిన తెలుగు తమ్ముళ్లు ఫ్లెక్సీని కొంచెం ఎత్తులో ఏర్పాటు చేశారు. పట్ట ణంలోని అంబేడ్కర్ సర్కిల్‌లో బస్‌షెల్టర్‌ను మూసివేస్తూ తెలుగు తమ్ముళ్లు పెద్ద ఫ్లెక్సీని ఏర్పాటు చేశారు. దీంతో ప్రయాణికులు జాతీయ రహదారి లోనే నిలబడాల్సి వచ్చింది. ఈ అసౌకర్యంపై 'అవధులు దాటిన అభిమానం - ప్రయాణికుల పాట్లు' శీర్షికన ఆంధ్రజ్యోతి దినపత్రికలో కథనం ప్రచురితమైంది. దీంతో బస్‌షెల్టర్ కనిపించే ఎత్తులో ఫ్లెక్సీని ఏర్పాటు చేశారు.

సామంచికి యువమోర్చా సన్మానం



పుత్తూరు, జనవరి 23(ఆంధ్రజ్యోతి): తిరుపతి జిల్లా బీజేపీ అధ్యక్షుడిగా నియమితులైన సామంచి శ్రీనివాస్‌ను నగరి నియోజకవర్గం తరపున యువ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి గాలి గాంధీ, కార్యదర్శి కదిరివేలు సన్మానిం చారు. మహిళా మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యురాలు నిషిధరాజు సూచ నల మేరకు తాము నియోజక వర్గం తరఫున శుభాకాంక్షలు తెలిపామని గాంధీ చెప్పారు. కార్యక్రమంలో హరి, రాములు పాల్గొన్నారు.

అత్యాధునిక వైద్య పరికరాల వితరణ



ఆరోగ్య కేంద్రానికి వైద్య పరికరాలు అందిస్తున్న అధికారులు

వడమాలపేట, జనవరి 23(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి అత్యాధునిక వైద్య పరికరాలు వితరణగా అందజేశారు. గురువారం హైదరాబాద్‌కు చెందిన అవేర్ హెల్త్ అండ్ రీసెర్చ్ ఫౌండేషన్ చైర్మన్ మాధవన్ ఎస్‌బీఐ సహకారంతో వాటిని అందించారు. హైడ్రాలిక్ బెడ్లు, ఇంజెక్షన్ ట్రాలీలు, ఎయిల్ కూలర్ అందజేశారు. కార్యక్రమంలో స్థానిక ఎస్‌బీఐ ఆర్‌ఎం వెంకటేశ్వరరావు, హెచ్‌ఆర్ మేనేజర్ శివయ్య, స్థానిక బ్రాంచ్ మేనేజర్ రవికుమార్, వైద్యాధికారి చక్రపాణి, హెల్త్ సూపర్‌వైజర్ చంద్రమోహన్ తదితరులు పాల్గొన్నారు.

మోటారు సైకిళ్ల స్వాధీనం : ఒకరి అరెస్టు

నాయుడుపేట టౌన్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రామకృష్ణాపురం, అమరావతి సెంటర్ వద్ద ఈ నెల 23వ తేదీ రెండు మోటారు సైకిళ్లు చోరీకి గురయ్యాయి. యజమానులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టగా గురువారం పట్టణానికి చెందిన వెంకటేష్‌ను అరెస్టు చేశారు. అతడి నుంచి రెండు మోటారు సైకిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ బాబి తెలిపారు.

అమిత్ షా క్షమాపణ చెప్పాలి

సూళ్లూరుపేట, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): కేంద్రమంత్రి అమిత్ షా అంబేడ్కర్‌పై చేసిన వ్యాఖ్యలు ఉపసంహరించుకుని దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలని కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సూళ్లూరుపేటలో గురువారం నిరసన ర్యాలీ చేశారు. కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి వెంకటచలపతి ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకులు ఆర్టీసీ బస్టాండు వద్దనున్న అంబేద్కర్ విగ్రహం వద్ద అమిత్ షాకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పురవీధుల్లో ర్యాలీ చేపట్టారు.

కళాశాల అభివృద్ధికి సహకరిస్తాం



సూళ్లూరుపేట, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల అభివృద్ధికి తమవంతు సహకారం అందిస్తామని పూర్వ విద్యార్థులు తెలిపారు. 1973-75 సంవత్సరంలో సైన్సు గ్రూపు అభ్యసించిన విద్యార్థులు గురువారం కళాశాలలో కలుసుకున్నారు. కళాశాల ప్రిన్సిపాల్ శ్యామ్ కుమార్‌ను సత్కరించారు. కళాశాల స్థితిగతులను అడిగి తెలుసుకొన్నారు. తాము చదివిన కళాశాల అభివృద్ధికి తమవంతు సహకారం అందిస్తామని ప్రిన్సిపాల్‌కు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఎం భాస్కర్‌బాబు, కళత్తూరు యుగంధర్ రెడ్డి, భాస్కర్‌రెడ్డి, ముప్పాళ్ల సుకుమార్, రాజేశ్వరి, లలిత, మంజులా, సౌజన్య, కే.సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

నిధుల వివరాలివ్వండి

వెంకటగిరిటౌన్, జనవరి 23(ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీలోని 1 నుంచి 25 వార్డులకు సంబంధించి 14, 15వ ఆర్థిక సంఘం నిధులు వివరాలు ఇవ్వాలని 14వ వార్డు కౌన్సిలర్ ఆరి శంకరయ్య కోరారు. ఈ మేరకు గురువారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఇన్‌చార్జి కమిషనర్ శ్రీధర్‌కు వినతి పత్రం అందించారు. 2021 డిసెంబరు నెల వరకు విడుదలైన నిధులు, ఖర్చు వివరాలు ఇవ్వాలని విన్నవించారు.

జనసేన సంబరాలు



వెంకటగిరి, .జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : జనసేన పార్టీకి కేంద్ర ఎన్నికల సంఘం ఎన్నికల గుర్తుగా గాజు గ్లాసును కేటాయించడంతో గురువారం ఆ పార్టీ నాయకులు పట్టణంలోని తెలుగు గంగ అతిథి గృహం వద్ద సంబరాలు చేసుకున్నారు. జనసేన నాయకులు తోట క్రిష్ణయ్య ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు అనిల్‌రామారావు, రాజేష్, రవి శంకర్, రవీంద్రరుడు, అపర్ణ, రేవతి పాల్గొన్నారు.

మద్యం బాటిళ్ల పట్టివేత

చిట్టమూరు, జనవరి 23(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని వేముగుంటపాళానికి చెందిన యనమల వెంకటయ్య 9 మద్యం బాటిళ్లను తరలిస్తుండగా వాకాడు ఎక్సైజ్ అధికారులు పట్టుకున్నారు. ఎక్సైజ్ సీఐ ప్రసాద్ కేసు నమోదు చేశారు.

సమస్యలు పరిష్కరించాలి

నాయుడుపేట, జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : ప్రైవేట్, ప్రభుత్వ విద్యారంగంలో నెలకొన్న సమస్యలు ప్రభుత్వం పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రవి కోరారు. నాయుడుపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం ఎస్వీ యూనివర్శిటీలో 28, 29 తేదీలలో నిర్వహించనున్న ఎస్ఎఫ్ఐ జిల్లా మహాసభలు గోడపత్రికలను ఆవిష్కరించారు.

రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత

తడ, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని సూళ్లూరుపేట సీఐ మురళీకృష్ణ అన్నారు. గురువారం స్థానిక అపాచీ పరిశ్రమలో రోడ్డు భద్రతా వారోత్సవాలను ఆయన ప్రారంభించారు. ఎస్ఐ కొండప నాయుడు, అపాచీ పీఆర్‌వో మోహన్, భాను పాల్గొన్నారు.

అల్లంపాడులో భూముల రీసర్వే

కోట, జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : అల్లంపాడులో గురువారం భూముల రీసర్వే జరిగింది. తహసీల్దారు జయజయరావు ఆధ్వర్యంలో సర్వేయర్ గోపీరెడ్డి పర్యవేక్షణలో వీఆర్వోలు శ్రీనివాసులు, సుబ్రహ్మణ్యం, ఏడుకొండలు, మోసీన్‌లు రైతుల సమక్షంలో రీసర్వేను ప్రారంభించారు. అల్లంపాడు పంచాయతీలో 830.25 ఎకరాలకు సంబంధించి భూముల రీసర్వేను నాలుగు బృందాలుగా అప్ప గించారు. మొదటిరోజు సర్వే వేగవంతమైంది.

మున్సిపాలిటీ వద్దు.. పంచాయతీనే ముద్దు



మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్ రాఘువేంద్రమీనా

చిల్లకూరు, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): చిల్లకూరు పంచాయతీని గూడూరు మున్సి పాలిటీ నుంచి తొలగించి పంచాయతీ చేయాలని చిల్లకూరు గ్రామస్తులు గురువారం స్థానిక ఎంపీడీవో కార్యాలయం వద్ద సబ్‌కలెక్టర్ రాఘవేంద్రమీనా ఆధ్వర్యంలో నిర్వ హించిన గ్రామసభలో కోరారు. దీంతో ఆయన పంచాయతీ ప్రజల నుంచి సంతకాలను సేకరించారు. అదేవిధంగా చెన్నూరు, నెల్లటూరు, పోటుపాళెం, దివిపాళెం పంచాయతీల్లో గ్రామసభలు నిర్వహించి ప్రజల అభిప్రాయాలను సేకరించారు. మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, ఎంపీడీవో గోపి, టీడీపీ నాయకులు చిల్లకూరు పట్టాభిరామిరెడ్డి, రామచంద్రారెడ్డి పాల్గొన్నారు.

భవిష్యత్తుకు మంత్రి లోకేశ్ కృషి



రక్తదాన శిబిరంలో ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్

గూడూరు అర్బన్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): యువత బంగారు భవిష్యత్తుకు మంత్రి నారా లోకేశ్ ఎంతో కృషిచేస్తున్నారని ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ అన్నారు. గురువారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే ఆధ్వర్యంలో లోకేశ్ పుట్టినరోజు వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముందుగా కేక్‌కట్ చేశారు. రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. యువకులు, పార్టీ శ్రేణులు, అభిమానులు రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో శీలం కిరణ్‌కుమార్, నెలబల్లి భాస్కర్‌రెడ్డి, పులిమి శ్రీనివాసులు, బిల్లు చెంచురామయ్య, మట్టం శ్రావణి, గుండాల లీలావతి, శ్రీదేవి, భారతి పాల్గొన్నారు.

వృద్ధులకు దుప్పట్ల పంపిణీ.. విద్యార్థులకు అన్నదానం




రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే విజయశ్రీ, పక్కనే మాజీ ఎమ్మెల్యే నెలవల సుబ్రమణ్యం, టీడీపీ నాయకులు సుధాకర్ రెడ్డి, రమేష్, మాధవనాయుడు ● కేక్ కట్‌చేస్తున్న సతీష్‌రెడ్డి

సూళ్లూరుపేట, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): విద్యాశాఖ మంత్రి లోకేశ్ జన్మదిన వేడుకలకు గురువారం సూళ్లూరుపేటలో ఆ పార్టీ నాయకులు పోటాపోటీగా రెండు చోట్ల నిర్వహించారు. స్థానిక సత్యసాయి కల్యాణ మండపంలో ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ, మాజీ ఎమ్మెల్యే నెలవల సుబ్రమణ్యం ఆధ్వర్యంలో రక్తదానం శిబిరం నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు నోట్ పుస్తకాలు, వృద్ధులకు దుప్పట్లను అందజేసి రైల్వేగేటు వద్దనున్న టీడీపీ కార్యాలయంలో అన్నదానం చేశారు.

● టీడీపీ కార్యాలయంలో టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి వేనాటి సతీష్ రెడ్డి కేక్‌కట్ చేశారు. జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి తిరమూరు సుధాకర్ రెడ్డి, పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు ఆకుతోట రమేష్, ఏజీ కిషోర్, చిట్టేటి పెరుమాల్, మాధవనాయుడు, నాపా మునిరాజా, చంద్రారెడ్డి, కొక్కు శంకరయ్య పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలు లేని జిల్లాగా తీర్చిదిద్దడమే లక్ష్యం



మాట్లాడుతున్న ఎస్ఈ సురేంద్రనాయుడు

నాయుడుపేట టౌన్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ సమస్యలు లేని జిల్లాగా తిరుపతిని తీర్చిదిద్దడమే లక్ష్యంగా పని చేస్తున్నామని విద్యుత్‌శాఖ ఎస్ఈ సురేంద్ర నాయుడు అన్నారు. నాయుడుపేట విద్యుత్ శాఖ డివిజన్ కార్యాలయంలో గురువారం నాయుడుపేట, గూడూరు డివిజన్‌లోని విద్యుత్ శాఖ అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు డివిజన్ పరిధిలో వినియోగదారులు సమస్యలపై అధికారులు తక్షణమే స్పందించేలా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లకు నాణ్యమైన విద్యుత్ అందిస్తామని వివరించారు. వేసవి కాలంలో ఎక్కడా విద్యుత్ సమస్యలు తలెత్తకుండా ముందస్తుజాగ్రత్తలు చేపట్టినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఈఈలు శ్రీనివాసులు, నరేంద్ర రెడ్డి, రవికుమార్, ఎస్‌వో శ్రీనివాసులు, నాయుడుపేట డీఈ వరప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నారా లోకేశ్ నేతృత్వం యువతకు భరోసా



కేక్ కట్‌చేస్తున్న వేనాటి సతీష్‌రెడ్డి, అశోక్‌రెడ్డి, రత్నం తదితరులు

నాయుడుపేట, జనవరి 23 : మంత్రి నారా లోకేశ్ నేతృత్వంలో యువత భవిష్యత్తుకు భరోసా ఉంటోందని తిరుపతి పార్లమెంట్ టీడీపీ ప్రధాన కార్యదర్శి వేనాటి సతీష్‌రెడ్డి అన్నారు. మంత్రి నారా లోకేశ్ జన్మదిన వేడుకలను గురువారం నాయుడుపేటలో అన్న క్యాంటీన్ వద్ద టీడీపీ పట్టణ అధ్యక్షుడు కందల కృష్ణారెడ్డి, రూరల్ అధ్యక్షుడు కామిరెడ్డి అశోక్ రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కేక్ కట్‌చేసి టీడీపీ నాయకులకు, కార్యకర్తలకు అభిమానులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పుదూరు రత్నం, అత్తికాయల సుబ్రహ్మణ్యం, సులేమాన్, సిరాజ్, గుంటూరు లక్ష్మయ్య, శ్రీనివాసులు, రఫి తదితరులు ఉన్నారు.

వెంకటగిరిలో టీడీపీ సంబరాలు



కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ, ఏఎంసీ మాజీ చైర్మన్ రాజేశ్వరరావు, నాయకులు కేవీకే ప్రసాద్ నాయుడు

వెంకటగిరి, జనవరి 23 : (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ నివాసంలోని టీడీపీ కార్యాలయంలో గురువారం మంత్రి నారా లోకేశ్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే రామకృష్ణ కేక్ కట్‌చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు పులికొల్లు రాజేశ్వరరావు, కేవీకే ప్రసాద్ నాయుడు, పునుగోటి విశ్వనాథ నాయుడు, తోట రామచంద్రయ్య, పోలంరెడ్డి కోటేశ్వరరెడ్డి, ఏలేశ్వరం రామ చంద్రయ్య నాయుడు, మంకు ఆనంద్, అవ్వారు సత్య నారాయణ, చెలికం ముదురెడ్డి, నరిసింహులు, మచ్చల వేణు, మునెయ్య, చెంగారావు, జనసేన నాయకులు పాల్గొన్నారు.

భర్త ఆత్మహత్య

దొరవారిసత్రం, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): శ్రీధనమల్లిలో కుటుంబ కలహాలతో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల కథనం మేరకు.. తొగరాముడి మునిశేఖర్ (28)కు ఆయన భార్య మధ్య చిన్న వివాదం తలెత్తింది. భార్య అలిగి పుట్టింటి కెళ్లింది. మనస్తాపం చెందిన మునిశేఖర్ బుధవారం రాత్రి ఇంట్లో ఉరేసుకుని చనిపోయాడు. గురువారం బంధువులు సూళ్లూరుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఎస్ఐ అజయ్‌కుమార్ కేసు నమోదు చేశారు.

పేదలకు దుస్తుల పంపిణీ

గూడూరు: స్థానిక బాలాజీనగర్‌లో రాష్ట్ర కాపునాడు జనరల్ సెక్రటరీ కంకణాల పెంచలనాయుడు ఆధ్వర్యంలో మంత్రి నారా లోకేశ్‌బాబు పుట్టినరోజు నిర్వహించారు. కేక్‌కట్ చేశారు. పేదలకు దుస్తులు అందించారు.

మున్సిపల్ అభివృద్ధికి చర్యలు



ఖాళీ బిందెలతో నిరసన తెలుపుతున్న మహిళలు

వెంకటగిరి, జనవరి 23: (ఆంధ్రజ్యోతి) వెంకటగిరి మున్సిపల్ అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకొంటున్నట్లు ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ తెలిపారు. గురువారం మున్సిపల్ కార్యాలయంలో ఆయన వివిధ శాఖల అధికారులు, బిల్ కలెక్టర్లు, ఇన్‌చార్జి కమిషనర్ శ్రీధర్‌తో సమీక్ష నిర్వహించారు. పట్టణంలో నూతనంగా నిర్మిస్తున్న ఇళ్లకు అనుమతులతో పాటు పన్నుల వసూళ్లు సకాలంలో వసూలు చేయాలని సూచించారు.

● ఖాళీ బిందెలతో నిరసన

పట్టణ పరిధిలోని 5వ వార్డు దొమ్మరపాళెం మహిళలు తమ వార్డులో నీరు రావడం లేదని, వీధి దీపాలు, కాలువలు లేక ఇబ్బంది పడుతున్నామని ఎమ్మెల్యే కురుగొండ్లను కలిసి వినతిపత్రం అందచేశారు. స్పందించిన ఆయన వెంటనే పరిష్కరించే దిశగా చర్యలు చేపట్టాలని అధికారులు ఆదేశించారు. అంతకు ముందు మహిళలు ఖాళీ బిందెలతో నిరసన తెలియజేశారు.

వాకాడులో లోకేశ్ జన్మదినం



వాకాడు, జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అశోక్ పిల్లర్ ప్రాంగణంలో మంత్రి నారా లోకేశ్ జన్మదిన వేడుకలను టీడీపీ సీనియర్ నాయకులు సన్నారెడ్డి విజయశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. దోశకాయల కృష్ణమూర్తి, నెల్లూరు సుధాకర్‌రెడ్డి, తిరుమూరు శ్రీనివాసులురెడ్డి, అన్నమేటి చంద్రయ్య, వాకాటి సంపత్‌కుమార్, మోహన్‌నాయుడు, కుంచం దయాకర్, గోవిందరాజులు పాల్గొన్నారు.

చిన్నాన్నపై కత్తితో దాడి

నాయుడుపేట టౌన్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అత్తలపాలెంలో చిన్నాన్నపై అన్న కుమారుడు దాడిచేసిన సంఘటన గురువారం చోటుచేసుకుంది. నాగరాజు తమ పొలం సర్వే కోసం తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకున్నాడు. దీనిపై నాగరాజుకు ఆయన అన్న కుమారుడు సుధాకర్‌కు వివాదం నెలకొంది. ఈ ఘర్షణలో చిన్నాన్నపై కత్తితో దాడిచేసి గాయపరిచాడు. గ్రామస్తులు నాగరాజును నాయుడుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

హెల్మెట్ ధరించాలి

ఓజిలి, జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : ద్విచక్రవాహన చోదకులు తమ వాహనానికి సంబందించి అన్ని పత్రాలతోపాటు లైసెన్సు ఉండాలని ఓజిలి ఎస్ఐ స్వప్న తెలిపారు. జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాలను పురస్కరించుకుని ఆమె మాట్లాడుతూ వాహన చోదకులు తప్పకుండా హెల్మెట్ ధరించాలని సూచించారు.

పేదలకు అన్నదానం



పెళ్లకూరు, జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : పెళ్లకూరులో టీడీపీ సీనియర్ నాయకులు పేరం రమేష్‌నాయుడు, మధునాయుడు ఆధ్వర్యంలో మంత్రి లోకేశ్ జన్మదిన వేడుకలను అట్టహాసంగా నిర్వహించారు. సూళ్లూరుపేట టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం ముఖ్య అతిథిగా విచ్చేసి కేక్ కట్‌చేశారు. ఆస్పత్రిలో రోగులకు బ్రెడ్లు, పండ్లు పంచిపెట్టారు. విద్యార్థులకు విద్యా సామగ్రి అందజేశారు. పేదలకు అన్నదానం చేశారు. పెళ్లకూరు గ్రామానికి చెందిన ఎన్ఆర్ఐ పేరం వెంకటతేజ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి రూ.5వేలు వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు నంచి కృష్ణయ్య, టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు వేలూరు మురళీకృష్ణారెడ్డి, స్వర్ణముఖినది ఆనకట్ట సిస్టమ్ ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్ ప్రసాద్‌నాయుడు, నాయకులు పేరం రమేష్‌నాయుడు, మధు నాయుడు, నాగేంద్ర ప్రసాద్‌రెడ్డి, రాజగోపాల్ రెడ్డి, శివకుమార్, మునీష్, చైతన్య కృష్ణారెడ్డి, శేఖర్‌నాయుడు, సిద్ధులయ్యానాయుడు ఉన్నారు.

కొత్తగుంటలో లోకేశ్ పుట్టిన రోజు



చిట్టమూరు, జనవరి 23(ఆంధ్రజ్యోతి): చిట్టమూరు (కొత్తగుంట)లో గురు వారం మంత్రి నారా లోకేశ్ పుట్టిన రోజు వేడుకలు ఘనంగా జరిగాయి. టీడీపీ మండల అధ్యక్షులు గణపర్తి కిషోర్ నాయుడు ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి చిన్నారావు, టీడీపీ నాయకులు మారంరెడ్డి జనార్ధన్‌రెడ్డి, బసిరెడ్డి హరికృష్ణారెడ్డి, గోపాల్‌నాయు డు, బాబు నాయుడు, చెంచురామయ్య ఆచారి, రషీద్, కస్తూరయ్య, రాజేష్‌రెడ్డి, బషీర్, సుధ, అంకయ్య, ముత్తు, బాబురెడ్డి, వెంకట రమణయ్య, మణి, ఓమనరావు ఉన్నారు.

ఉనికి కోసమే పోరుబాట



మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

పెళ్లకూరు, జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ నేత కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి తన ఉనికిని కాపాడుకోవడం కోసం పోరుబాట కార్యక్రమం పేరుతో ప్రభుత్వంపై లేనిపోని ఆరోపణలు చేస్తున్నాడని టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు వేలూరు మురళీకృష్ణారెడ్డి, టీడీపీ మండల అధ్యక్షుడు నంచి కృష్ణయ్య, ప్రధాన కార్యదర్శి దేవారెడ్డి నాగేంద్ర ప్రసాద్‌రెడ్డి , పేరం సందీప్ తేజ పేర్కొన్నారు. గురువారం పెళ్లకూరులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా కూటమి ప్రభుత్వ పాలనలో అమలు జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను చూసి వైసీపీ అధినేత జగన్‌తో పాటు ముఖ్య నాయకులంతా ఏమిచేయాలో దిక్కుతోచని పరిస్థితుల్లో ఉన్నారని పేర్కొన్నారు. ఈ పరిస్థితుల్లో సత్యనారాయణరెడ్డి నెలకోరోజు గ్రామాల్లో టీడీపీపై బురదజల్లడం మానుకోవాలని హితవు పలికారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని స్థానాలనూ కైవసం చేసుకుంటామని ధీమా వ్యక్తం చేశారు.

క్రీడలతో మానసిక ఒత్తిడి దూరం

డక్కిలి, జనవరి 23 : (ఆంధ్రజ్యోతి) క్రీడలతో మానసిక ఒత్తిడి తగ్గుతుందని వెంకటగిరి ఏఎంసీ మాజీ చైర్మన్ పులికొల్లు రాజేశ్వరరావు అన్నారు. డక్కిలిలో ఈ నెల 12వ తేదీ నుంచి జరుగుతున్న క్రికెట్ పోటీలు ముగిశాయి. గురువారం నిర్వహించిన ఫైనల్స్‌లో కమ్మపల్లి రోడ్డు జట్టు విజేతగా నిలిచింది. లింగసముద్రం జట్టు రన్నర్స్‌గా నిలిచింది. విజేతకు రూ.50వేల నగదు షీల్డ్ అందించారు. విజేతకు రూ.25వేల నగదు అందించారు. ఈ పోటీలను డక్కిలికి చెందిన పిన్నక సోదరులు తమ తల్లిదండ్రులు కొండయ్య, రత్నమ్మల జ్ఞాపకార్థం నిర్వహించారు. మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్‌గా నిలిచిన లింగసముద్రం కెప్టెన్ గంగాధర్‌కు ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ రూ.10 వేలు, మ్యాన్ ఆఫ్ ద సిరీస్‌గా నిలిచిన అభికి ఎంపీడీవో గుణశేఖరరెడ్డి రూ .5 వేలు ప్రోత్సాహక నగదు బహుమతులు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో పిన్నక సోదరులు జగదీష్ బాబు, జగదీష్, పాస్టర్ ప్రాన్సిస్ హాజరయ్యారు.

ప్రైవేటు వెంచర్‌కు ప్రభుత్వ భూమిలో రోడ్డు

విద్యుత్ టవర్ కిందనించే వేసేశారు



132 కేవీ విద్యుత్ టవర్ ఉన్నా నిర్మించిన రోడ్డు



ఉపాధి హామీ పథకం నిధులతో నిర్మించిన రోడ్డు

రేణిగుంట, జనవరి 23(ఆంధ్రజ్యోతి): ఒక ప్రైవేటు వెంచర్ కోసం ఉపాధి పథకం కింద రూ.25.7లక్షలతో రోడ్డు నిర్మించారంటూ రేణిగుంట మండలం మల్లవరంలో వివాదం నడుస్తోంది. మార్గంలో 132 కేవీ విద్యుత్ టవర్ అడ్డుగా ఉన్నా దాని కింద నుంచి పనులు కానిచ్చేశారని అంటున్నారు. మండలంలోని మల్లవరంలో రోడ్డు వెడల్పు చేయడానికి మట్టిని గురువారం తోలుతుండగా హక్కు దారులమని కొందరు అడ్డుకున్నారు. దీంతో ఇరువర్గాల నడుమ వివాదం కాస్త ఘర్షణకు దారితీసింది. 2007 నుంచీ ఈ భూమి వివాదం నడుస్తోంది. అయితే వైసీపీ ప్రభుత్వంలో తమ భూమిలో గ్రామానికి అని చెప్పి ప్రైవేటు వెంచర్‌కు ప్రభుత్వ నిధులతో రోడ్డు వేసుకున్నారని కొందరు ఆరోపిస్తున్నారు. ఇప్పుడు 132 కేవీ విద్యుత్ టవర్ అడ్డం ఉన్నందువల్ల ప్రైవేటు వెంచర్‌కు అప్రూవల్ రాలేదంటూ రోడ్డును వెడల్పు చేస్తుండడంతో అడ్డుకున్నామని చెప్పారు. ఈ విషయమై సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి విచారణ జరిపి తమకు న్యాయం చేయాలని కోరారు.

అంబేడ్కర్‌ను నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న సీటీ రవి

నారాయణవనం, జనవరి 23(ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయాలను, స్ఫూర్తిని నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని అఖిల భారత జనత పార్టీ జనరల్ సెక్రటరీ సీటీ రవి పేర్కొన్నారు. గురువారం మండలంలోని సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాలలో సంవిధాన్ గౌరవ్ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... భారత రాజ్యాంగాన్ని అంబేడ్కర్ అన్ని వర్గాల అభివృద్ధి కోసం రచించారన్నారు. అదే విధంగా అంబేడ్కర్ ఆశయ సాధన కోసం బీజేపీ ప్రభుత్వం, ప్రధానమంత్రి నరేంద్రమోదీ కృషి చేస్తున్నారన్నారు. కళాశాల చైర్మన్ అశోక రాజు మాట్లాడుతూ అంబేడ్కర్ మేధస్సును, ఆయన కలలు కన్నా సమానత్వం, సౌభ్రాతృత్వాన్ని నేటి యువత అందిపుచ్చుకోవాలని పిలుపునిచ్చారు. బీజేపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు సామంచి శ్రీనివాస్, చిత్తూరు జిల్లా అధ్యక్షుడు జగదీశ్వర నాయుడు, ఎస్సీ మోర్చా నాయకుడు రమేష్ నాయుడు, రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్, టీటీడీ బోర్డు మెంబర్ భానుప్రకాష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చెరివిలో ముగిసిన కంటి వైద్య శిబిరం

శ్రీసిటీ, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): శ్రీసిటీలోని టిల్ హెల్త్‌కేర్ పరిశ్రమ, శ్రీసిటీ ఫౌండేషన్ కలిసి చెరివిలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న ఉచిత కంటి వైద్య శిబిరం గురువారంతో ముగిసింది. మొత్తం 505 మందికి పరీక్షలు నిర్వహించగా వీరిలో 242 మందికి కంటి చుక్కల మందులు, 279 మందికి కంటి అద్దాలు అందజేశారు. 48 మందికి శుక్లం (కాటరాక్ట్) ఉన్నట్లుగా గుర్తించారు. చెన్నైలోని శంకర నేత్రాలయలో ఉచితంగా ఆపరేషన్లు చేయనున్నారు. టిల్ హెల్త్‌కేర్ డైరెక్టర్ అజయ్ కుమార్, ప్లాంట్ ఆపరేషన్ హెడ్ అరుణ్ మంగ్లా, శ్రీసిటీ ఫౌండేషన్ ప్రతినిధి నిరీషా సన్నారెడ్డి, టిల్ హెల్త్‌కేర్ హెచ్ ఆర్ మేనేజర్ రవిచంద్ర, శ్రీసిటీ ఫౌండేషన్ సీనియర్ మేనేజర్ సురేంద్ర కుమార్ పాల్గొన్నారు. శంకర నేత్రాలయ, ఏసిటీ యూనిట్ కంటి వైద్యుల బృందం, పారామెడికల్ సిబ్బంది వైద్య సేవలందించారు.

ముక్కంటి ఆలయంలో గ్యాలరీలను ఏర్పాటు చేయండి

శ్రీకాళహస్తి, జనవరి 23(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో భక్తుల కోసం గ్యాలరీలు ఏర్పాటు చేయాలని హిందు ధార్మిక మండలి పట్టణ కన్వీనర్ గరికపాటి రమేష్‌బాబు కోరారు. ఈ సంద్భంగా ఈవో బాపిరెడ్డికి లేఖ ద్వారా గురువారం విన్నవించారు. అలాగే నిత్యం దేవాలయ పరిసర ప్రాంతాల్లో వాహనాల వలన భక్తులు, పట్టణ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ నేపథ్యంలో కార్లు, బస్సులు, టూరిస్టు వాహనాల పార్కింగ్ కోసం శాశ్వత పరిష్కారం చూపాలన్నారు. స్నాన ఘట్టాలు, మరుగుదొడ్లు చాలడం లేదన్నారు. దీంతో ప్రైవేటు వారికి డబ్బులుచెల్లించి వినియోగించుకోవాల్సి వస్తోందన్నారు. శివరాత్రి సందర్భంగా క్యూలైన్లు ఏర్పాటు చేయడం కన్నా గ్యాలరీలు ఏర్పాటు చేస్తే బాగుంటుందన్నారు.

సినీ హీరో నితిన్‌కు ముక్కంటి ప్రసాదాలు



శ్రీకాళహస్తి, జనవరి 23(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి దర్శనార్థం హీరో నితిన్ తిరుపతి విమానాశ్రయానికి గురువారం చేరుకున్నారు. ఈ నేపథ్యంలో పట్టణానికి చెందిన మాజీ కౌన్సిలర్, టీడీపీ నాయకుడు నాగమల్లి దుర్గాప్రసాద్ ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి కలంకారీ కండువాతో సత్కరించి ముక్కంటి ప్రసాదాలను అందజేశారు. బాలాజీ రెడ్డి, వినయ్‌కుమార్, సాయినాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా నేతాజీ జయంతి

శ్రీకాళహస్తి, జనవరి 23(ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య సమరయోధుడు, జాతీయవాది సుభాష్ చంద్రబోస్ జయంతి వేడుకలను పట్టణంలోని బాబుఅగ్రహారం పురపాలకసంఘ ఉన్నత పాఠశాలలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పలువురు మాట్లాడుతూ ఆయన దేశం కోసం చేసిన త్యాగాన్ని కొనియాడారు. ఆయన పోరాట స్ఫూర్తి అందరికీ ఆదర్శనీయమన్నారు. ఏపీసీడ్స్ కార్పొరేషన్ వర్కర్స్ యూనియన్, ట్రేడ్ యూనియన్ కోఆర్డినేషన్ సెంటర్ ఆధ్వర్యంలో బోస్ జయంతి వేడుకలను నిర్వహించారు.

సాహిత్యానికి సంగీత పరిమళం అద్దిన పండితుడు

రాళ్లపల్లె జయంతి సభలో ఆచార్య దీప్తి



రాళ్లపల్లె విగ్రహానికి నివాళి అర్పిస్తున్న ఆచార్య దీప్తి

తిరుపతి (విశ్వవిద్యాలయాలు) జనవరి 23 (ఆంధ్రజ్యోతి): రాళ్లపల్లె అనంతకృష్ణ శర్మ సాహిత్యానికి సంగీత పరిమళం అద్దిన పండితుడని జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయ ఆంగ్ల విభాగ ఆచార్యులు దీప్తి పేర్కొన్నారు. రాళ్లపల్లె అనంతకృష్ణ శర్మ జయంతి కార్యక్రమాన్ని టీటీడీ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. పద్మావతి యూనివర్సిటీ సమీపంలో గల ఆయన విగ్రహానికి తొలుత పుష్పాంజలి ఘటించారు. అన్నమాచార్య కళా మందిరంలో నిర్వహించిన జయంతి సభలో అనంతకృష్ణశర్మ మనుమరాలు ఆచార్య దీప్తి మాట్లాడారు. రాళ్లపల్లెకు సంగీతం, సాహిత్యం రెండు కళ్లు అన్నారు. అన్నమయ్య కీర్తనలను పరిష్కరించి, స్వరపరిచి, గ్రంథం చేసిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. గౌరిపెద్ది వేంకట శంకర భగవాన్ మాట్లాడుతూ సామాన్య ప్రజలకు అర్థమయ్యేలా అన్నమయ్య కీర్తనల్లోని ఆనాటి సాహిత్యాన్ని పరిష్కరించి, అందించారన్నారు. ప్రముఖ శాసన పరిశోధకులు సొరకాయల కృష్ణారెడ్డి మాట్లాడుతూ సంగీతం, సాహిత్యం తెలిసిన పండితుడు రాళ్లపల్లె అని కొనియాడారు. కార్యక్రమంలో అన్నమాచార్య ప్రాజెక్టు డైరెక్టర్ రాజగోపాల రావు, ప్రోగ్రాం అసిస్టెంట్ కోకిల పాల్గొన్నారు.

శుభకార్యాలకు ఉచితంగా ధ్యాన మందిరం

వరదయ్యపాళెం, జనవరి 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని గోవర్ధనపురంలో ఉన్న లోకా ఫౌండేషన్ ధ్యానమందిరాన్ని వివాహాది శుభాకార్యాలు ఉచితంగా ఇస్తామని కోఆర్డినేటర్ బొప్పన రమేష్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శుభాకార్యాలు నిర్వహించుకునే వారు తాము తలపెట్టిన శుభాకార్యం వివరాలు, తేదీ రాతపూర్వకంగా గోవర్ధనపురంలోని లోకా ఫౌండేషన్ కార్యాలయంలో అందజేసి అనుమతి తీసుకోవాలన్నారు.

వార్షిక బ్రహ్మోత్సవాలకు వీరరాఘవస్వామి ఆలయం సర్వం సిద్ధం

నారాయణవనం, జనవరి 23(ఆంధ్రజ్యోతి):మండలంలోని కనకవల్లీ, వేదవల్లీ సమేత వీర రాఘవస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలకు సర్వం సిద్ధం చేసినట్లు ఆలయ ధర్మకర్తల మండలి అధ్యక్షుడు సుబ్రమణ్యం పేర్కొన్నారు. ఈ నెల 27వ తేదీ సోమవారం రాత్రి అంకురార్పణతో ఉత్సవాలు ప్రారంభమవుతాయని తెలిపారు.

వారపు సంతలో అభివృద్ధి పనులకు భూమిపూజ



అభివృద్ధి పనుల భూమి పూజలో ఎమ్మెల్యే సుధీర్ తదితరులు

రేణిగుంట, జనవరి 23(ఆంధ్రజ్యోతి): స్థానిక వారపు సంతలో రూ.1.12 కోట్లతో నిర్మించనున్న పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే సుధీర్ భూమి పూజను నిర్వహించారు. గురువారం సాయంత్రం సంతగేటు వద్ద సిమెంటు రోడ్లు, షెడ్లు, మరుగుదొడ్లు, మురుగు కాలువలు, తాగునీటి వసతులకు భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వారపు సంతలో 117 షాపులను నిర్మిస్తామన్నారు. ఈ దుకాణాల్లో ప్రతి రోజు వ్యాపారం నిర్వహించే చర్యలు తీసుకుంటామన్నారు. జ్యోతినగర్‌లో రూ.42 లక్షలతో సిమెంటు రోడ్లు నిర్మిస్తామన్నారు. మహా శివరాత్రి బ్రహ్మోత్సవాల్లో సామాన్య భక్తులకు పెద్దపీట వేస్తున్నామని మాజీ ఎమ్మెల్యేలాగా ఆలయంలో కూర్చొని బాబాలాగా భక్తులకు పండ్లు పంపిణీ చేయనని తెలిపారు. టీడీపీ మండల, పట్టణ అధ్యక్షులు మునిచంద్రారెడ్డి, మెహబూబ్‌బాషా, తిరుపతి పార్లమెంట్ టీడీపీ ఉపాధ్యక్షుడు సుబ్రమణ్యం రెడ్డి, ఎంపీడీవో విష్ణు చిరంజీవి, తహసీల్దారు సురేష్‌బాబు, ఈవోపీఆర్డీ ప్రభురావు, పీఆర్ ఏఈ రమణారావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సుదర్శన్ రెడ్డి, సీఐ మురళీకృష్ణ, పంచాయతీ కార్యదర్శులు మణి, బాలాజి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మంత్రి లోకేశ్ జన్మదినం





శ్రీకాళహస్తిలో కేక్ తినిపిస్తున్న ఎమ్మెల్యే సుధీర్ - పిచ్చాటూరులో కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే ఆదిమూలం - తొట్టంబేడులో కేక్ కటింగ్




సత్యవేడులో టీడీపీ నాయకుల రక్తదానం - చిన్నపాండూరులో కేక్ కటింగ్

శ్రీకాళహస్తి, జనవరి 23(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర విద్యా శాఖ మంత్రి లోకేశ్ దార్శనికత స్ఫూర్తిదాయకమని ఎమ్మెల్యే సుధీర్ అన్నారు. పట్టణంలోని ఎన్టీఆర్ కూడలి వద్ద లోకేశ్ జన్మదినం సందర్భంగా భారీ కేక్‌ను కట్ చేసి పంచిపెట్టారు. యువగళం పాదయాత్రలో ప్రజల కష్టాలను నేరుగా తెలుసుకుని వాటిని పరిష్కరిస్తున్నారన్నారు. టీడీపీ పట్టణాధ్యక్షుడు విజయకుమార్, తిరుపతి పార్లమెంట్ తెలుగు యువత అధ్యక్షుడు కృష్ణయాదవ్, కంఠా రమేష్, కాసరం రమేష్, అస్మత్ తదితరులు పాల్గొన్నారు. కొత్తపేట ప్రాథమికోన్నత పాఠ శాలలో మాజీ కౌన్సిలర్లు అనిత, సుప్రజ ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి. తొట్టంబేడు మండలం చంద్రబాబునాయుడు ఎస్టీకాలనీలో టీడీపీ మండల అధ్యక్షుడు గాలి మురళీ నాయుడు, భాస్కర్, వెంకటేష్, బాలసుబ్రహ్మణ్యం తదితరుల ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి.

నాగలాపురం (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గాంధీ విగ్రహం వద్ద మంత్రి లోకేశ్ జన్మదిన వేడుకల్లో ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పాల్గొన్నారు. టీడీపీ మండల అధ్యక్షుడు శ్రీనివాస యాదవ్, మాజీ ఎంపీపీ మురళి, పార్తిబన్, తెలుగుయువత నాయకుడు రాజారాం, చంద్రశేఖర్ రాజు తదితరులు పాల్గొన్నారు.

పిచ్చాటూరు (ఆంధ్రజ్యోతి): మంత్రి లోకేశ్ జన్మదిన వేడుకలను పిచ్చాటూరులో ఎమ్మెల్యే ఆదిమూలం ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు గురువారం ఘనంగా నిర్వహించాయి. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో వేడుకలు జరిగాయి.

కేవీబీపురం(ఆంధ్రజ్యోతి): మంత్రి లోకేశ్ జన్మదినం సందర్భంగా టీడీపీ నాయకులు సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదానం చేశారు. టీడీపీ మండల అధ్యక్షుడు రామాంజులునాయుడు, తిరుపతి పార్లమెంట్ తెలుగురైతు అధ్యక్షుడు గోపీనాథరెడ్డి, సర్పంచ్ బాలాజీ, మాజీ ఎంపీపీ మణి, జడ్పీటీసీ మాజీ సభ్యుడు విజయ నాయుడు, బీజేపీ మండల అధ్యక్షుడు బాబు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఏర్పేడు(ఆంధ్రజ్యోతి): మంత్రి లోకేశ్ జన్మదిన వేడుకలను ఏర్పేడు పట్టణంలో టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రెడ్డివారి గురవారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. అదే విధంగా నాగంపల్లి వద్ద ఉన్న డేవిడ్‌రీస్ ఆస్పత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్లు అందజేశారు. పొన్నారావు, సూరి నాయుడు, రమణ, మునెయ్య, వెంకట రమణారెడ్డి, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

నారాయణవనం (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర యువతను అన్ని విధాలుగా అభివృద్ధి చేయడానికి మంత్రి లోకేశ్ పనిచేస్తున్నారని ఎమ్మెల్యే ఆదిమూలం అన్నారు. గురువారం లోకేశ్ జన్మదినం సందర్భంగా దుండి వినాయక స్వామి ఆలయంలో 101 టెంకాయలు కొట్టారు. అంబేడ్కర్ విగ్రహం వద్ద కేక్ కట్ చేసి పంచిపెట్టారు. అన్నదానం చేశారు. జడ్పీటీసీ సభ్యుడు సుమన్ కుమార్, నాయకులు ఆర్డీ ఏకాంబరం, భాస్కరన్, రవి, మాణిక్యం రెడ్డి, హరి తదితరులు పాల్గొన్నారు.

వరదయ్యపాళెం(ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నపాండూరు బస్టాండ్ ఆవరణలో మంత్రి లోకేశ్ జన్మదనం సందర్భంగా గురువారం రాత్రి తెలుగు యువత మండల అధ్యక్షుడు అజయ్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి పంచి పెట్టారు. అనంతరం అన్నదానం చేశారు. బి.దశరథయ్య, పేరయ్య, రమేష్‌నాయుడు, శివయ్య, జనసేన నాయకుడు తులసి తదితరులు పాల్గొన్నారు.

సత్యవేడు (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గాంధీ విగ్రహం వద్ద టీడీపీ మండల అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి పంచి పెట్టారు. అనంతరం ఎన్టీఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొని రక్తదానమిచ్చారు. కార్యక్రమంలో టీడీపీ కో ఆర్డినేటర్ శ్రీపతిబాబు, అబ్జర్వర్ చంద్రశేఖర్, నాయకులు సుందరరామిరెడ్డి, పరమశివం, చిన్న, శివానందం, లోకయ్యరెడ్డి, పీఎస్ఆర్, హేమభూషణం, శశి, కుబేంద్రన్, బాబు, ప్రభాకర్‌రెడ్డి, సురేంద్రరెడ్డి అరుళ్ పాల్గొన్నారు.

● స్థానిక అంబేడ్కర్ విగ్రహం వద్ద తెలుగు యువత రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ శివకుమార్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి, అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో పృథ్వీ, శివయ్య, గోవిందు చౌదరి, కృష్ణయ్య, కోనయ్య, దిలీప్ శోభ, వాసు, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలు



ప్రమాదంలో దెబ్బతిన్న కార్లు



శ్రీకాళహస్తి. జనవరి 23(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో నలుగురు గాయపడ్డారు. పట్టణంలోని గాండ్ల వీధికి చెందిన యువరాజ్ తన కుటుంబంతో సూళ్ళూరుపేటకు కారులో బయలుదేరాడు. వీరితో పాటు స్నేహితుడైన నారాయణపురం జవహర్ మరో కారులో వారిని అనుసరించారు. ముందు వెళుతున్న యువరాజ్ కారు, ఎదురుగా వచ్చే వైపుల లారీ ఢీకొన్నాయి. దీంతో వెనుక వస్తున్న జవహర్ కారు కూడా అదుపుతప్పి ముందు ఉన్న కారును ఢీకొంది. ఈ ఘటనలో యువరాజ్ సహా కుటుంబసభ్యులు గీత, యోగేష్, భార్గవి గాయపడ్డారు. అలాగే వెనుక కారులో ఉన్న జవహర్ కూడా స్వల్పంగా గాయపడ్డాడు. తొట్టంబేడు పోలీసులు క్షతగాత్రులను శ్రీకాళహస్తి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు.

శాస్త్రోక్తంగా గురుదక్షిణామూర్తికి పూజలు



శ్రీకాళహస్తి, జనవరి 23(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో కొలువై ఉన్న మేధో గురుదక్షిణామూర్తికి గురువారం శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. కలశ ప్రతిష్టాపన అనంతరం వినాయక పూజ, వైదిక కృతువులు నిర్వహించారు. అనంతరం స్వామివారిని పాలు, పెరుగు, పంచామృతం, చందనం, నారికేళ జలాలతో అభిషేకించారు. పుష్పాలు, స్వర్ణాభరణాలతో అలంకరించి నైవేద్యాలు సమర్పించారు. పర్వత, చక్ర, కుంభ, మహామంగళ హారతులు ఇచ్చారు. భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని స్కూటరిస్టు మృతి

రేణిగుంట, జనవరి 23(ఆంధ్రజ్యోతి): గుర్తుతెలియని వాహనం ఢీకొని ద్విచక్ర వాహనదారుడు మృతి చెందాడు. ఈ సంఘటన గురువారం తెల్లవారుజామున కొత్త చెక్‌పోస్టు కూడలి సమీపంలోని వంతెనపై జరిగింది. చెంగారెడ్డిపల్లి ఎస్టీ కాలనీకి చెందిన గురుస్వామి(32)ప్రైవేటు కర్మాగారంలో విధులు ముగించుకుని ద్విచక్ర వాహనంపై ఇంటికి వెళ్తుండగా రేణిగుంట- కోడూరు ప్రధాన రహదారిలోని వంతెనపై గుర్తుతెలియని వాహనం ఢీకొని వెళ్లిపోవడంతో తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తిరుపతి రుయా ఆస్పత్రికి తరలించినట్లు ఎస్ఐ అరుణ్‌కుమార్ తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య?



శ్రీకాళహస్తి, జనవరి 23(ఆంధ్ర జ్యోతి): రైలు కింద పడి గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రైల్వే హెడ్‌కానిస్టేబుల్ నరసింహులు తెలిపిన వివరాలు... శ్రీకాళహస్తి రైల్వేస్టేషన్ సమీపంలోని పట్టాలపై బుధవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తి రైలుకింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు.

మినీ గోకులం, సిమెంటు రోడ్ల పరిశీలన



ఏర్పేడు, జనవరి 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాజులపాళెం పంచాయతీలో నిర్మించిన గోకులం షెడ్‌ను గురువారం డ్వామా పీడీ శ్రీనివాసప్రసాద్ పరిశీలించారు. అదే విధంగా పల్లం పంచాయతీలో సిమెంటు రోడ్డు నిర్మాణాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రోడ్డు నిర్మాణ పనులను నాణ్యంగా చేపట్టాలన్నారు. పనుల్లో తేడా ఉంటే చర్యలు తప్పవన్నారు. అధికారులు చంద్రశేఖర్‌రాజు, దేవరి, రవితేజ, శాలి మనోహర్, బాలాజీరావు తదితరులు పాల్గొన్నారు.

గెస్ట్ లెక్చరర్ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

శ్రీకాళహస్తి, జనవరి 23(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ మహిళ డిగ్రీ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ గెస్ట్ లెక్చరర్ పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ బి.రాజశేఖర్ తెలిపారు. బీఎస్సీ డిగ్రీ విద్యార్థులకు కంప్యూటర్ సైన్స్ బోధించేందుకు ఎమ్మెసీ(కంప్యూటర్స్), ఎమ్మెస్సీ(ఐటీ), ఎంసీఏ, ఎంటెక్(కంప్యూటర్ సైన్స్/ఐటీ)లో 55శాతం మార్కులు సాధించిన వారు అర్హులన్నారు. పీహెచ్‌డీ, యూజీసీ-నెట్, సెట్ ఉత్తీర్ణత సాధించిన వారికి ప్రాధాన్యం ఇస్తామన్నారు. ఫిబ్రవరి 1న ఉదయం 10గంటలకు కళాశాలలో జరిగే ఇంటర్వ్యూలకు సర్టిఫికెట్లతో హాజరు కావాలన్నారు. వివ రాలకు నెం.9246990123లో సంప్రదించా లన్నారు.

భూ సమస్యలను పెండింగ్‌లో ఉంచొద్దు

కేవీబీపురం, జనవరి 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని భూ, ఇంటి స్థలాల సమస్యలను పెండింగ్‌లో ఉంచవద్దని ఆర్డీవో భానుప్రకాష్‌రెడ్డి ఆదేశించారు. తహసీల్దారు కార్యాలయంలో ప్రజా వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇటీవల జరిగిన రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన అర్జీలను ఆయా వీఆర్వోలు, సర్వేయర్లు, సిబ్బంది పెండింగ్‌లో ఉంచకుండా పరిష్కరించాలన్నారు. సమస్యలను సాధ్యమైనంత వరకు తహసీల్దారు కార్యాలయంలో పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ మునిరత్నంరెడ్డి, మండల సర్వేయర్ సురేష్, వీఆర్వోలు తదితర రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

క్యాట్ ఒలంపియాడ్‌లో శ్రీచైతన్య విద్యార్థుల ప్రతిభ



శ్రీకాళహస్తి, జనవరి 23(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శ్రీచైతన్య స్కూల్ బ్రాంచ్ 1 విద్యార్థులు క్యాట్ ఒలంపియాడ్‌లో ప్రతిభ చూపారు. ఏజీఎం సురేష్ గురువారం మాట్లాడుతూ శ్రీచైతన్య విద్యార్థులు అన్ని రకాల ఒలంపియాడ్ పరీక్షల్లో ముందంజలో ఉంటారన్నారు.ఈ పరీక్షల్లో 43మంది విద్యార్థులు పాల్గొనగా ఏడుగురు క్యాస్ అవార్డులు పొందగా 17మంది పతకాలు, సర్టిఫికెట్లు, 19మంది సర్టిఫికెట్లు పొందారన్నారు. ఈ కార్యక్రమంలోప్రిన్సిపాల్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మహాసభలను జయప్రదం చేయండి: సీపీఎం

పిచ్చాటూరు, జనవరి 23(ఆంధ్రజ్యోతి): కార్మికులు, రైతులు, కూలీలు సమస్యలపై నిత్యం పోరాడుతున్న సీపీఎం ప్రపంచీ కరణకు, మతోన్మాదానికి వ్యతిరేకంగా రాజ్యాంగ పరిరక్షణ కోసం అనేక ఉద్యమాలు చేసిందని సీపీఎం జిల్లా కార్యదర్శి సభ్యుడు దాసరి జనార్దన్ అన్నారు. ఫిబ్రవరి 1, 2, 3 తేదీల్లో నెల్లూరు జరిగే సభలను విజయవంతం చేయాలంటూ ఆ పార్టీ నాయకులతో కలిసి పోస్టర్లను ఆవిష్కరించారు. జె.రామచంద్రా రెడ్డి, దాసు, ఆది తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ నేతలకు నియోజకవర్గ పదవులు



మోహన్ మొదలియార్

నాగలాపురం, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): మండలానికి చెందిన పలువురు వైసీపీ నాయకులకు ఆ పార్టీ అధిష్ఠానం నియోజకవర్గ స్థాయి పదవులు అప్పగించింది. సత్యవేడు నియోజకవర్గ ఇంటలెక్చువల్ ఫోరం వింగ్ అధ్యక్షుడిగా నాగలాపురానికి చెందిన మోహన్, మైనార్టీ సెల్ అధ్యక్షుడిగా టీపీకోటకి చెందిన షాబుద్దీన్, అంగన్‌వాడీ వింగ్ అధ్యక్షురాలిగా కల్పనా విజయకుమార్ నియమితులయ్యారు.